సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
సోమవారం, 27.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 185
పేజీలు: 12 వెల: రూ. 5

## మెట్రో ఇక సర్కారు రైలు

### రూ. 15 వేల కోట్లతో ఎల్ అండ్ టీ వాటాల కొనుగోలు!

- వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో మార్పులు
- హైదరాబాద్ మెట్రో బోర్డులో సీఎస్, డీజీపీ
- ప్రభుత్వ నియంత్రణలోకి సంస్థ



భాగ్యనగర వాసుల జీవననాడి హైదరాబాద్ మెట్రో రైలులో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (PPP) పద్ధతిలో సాగిన మెట్రో ప్రయాణం ఇకపై పూర్తిస్థాయి ప్రభుత్వ అజమాయిషీలోకి రానుంది. ఎల్ అండ్ టీ మెట్రో సంస్థలోని 100 శాతం వాటాలను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోబోతోంది. సుమారు రూ. 15,000 కోట్ల భారీ ఒప్పందంతో ఈ నెల 30 లోపు మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోనుంది. ఈ చారిత్రక పరిణామంతో అటు పాలనలో, ఇటు భద్రతలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఇప్పటికే మెట్రో బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ సీఎస్, డీజీపీ వంటి అధికారులను డైరెక్టర్లుగా నియమించింది.

-ముద్ర, తెలంగాణ బ్యూరో

09


## భారత్ విశ్వరూపం

### 133వ మన్ కీ బాత్ లో ప్రధాని మోడీ



- సైన్స్ అండ్ టెక్నాలజీపై 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు
- కల్పకం ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ పనితీరు బాగుంది క్రిటికాలిటి దాటడం సంతోషం
- దీనివల్ల ఇంధన ఖర్చు తగ్గుతుంది.
- ప్రపంచ దేశాల్లో ఇలాంటి టెక్నాలజీ చాలా తక్కువ

03




## పునాదులపై

కేసీఆర్ నిర్మించిన చోట కవిత పార్టీ | టీఆర్ఎస్ పేరుతోనే ఫస్ట్ సక్సెస్

# రాజకీయ పోరు

### కవితకు కలిసి వచ్చే అంశాలేంటి?

- పార్టీ పేరు వెనకే పెద్ద ప్లాన్
- కొత్త పార్టీకి ఎంత స్పేస్...?
- ముందు నుంచే కవిత వ్యూహాలు
- టీఆర్ఎస్ గా వస్తామనే సంకేతాలు
- కేసీఆర్ చర్చల్లో ఉండగానే.. టీఆర్ఎస్ ఆవిర్భావం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

టీఆర్ఎస్.. పేరేదైనా దీనికో పెద్ద చరిత్రే ఉంది. తెలంగాణ ఉద్యమ చరిత్ర. రాజకీయంగా ఏం జరిగిందనేది పక్కనపెడితే.. మఖలో పుట్టి పుబ్బలో పోతుందని కామెంట్స్ చేసిన వారందరినీ భూ స్థాపితం చేసిన పార్టీ టీఆర్ఎస్. పదేండ్ల అధికారం, సొంత నేతలకు అందలం.. ఇలా ఎన్నో ప్రయోగాలు చేసిన కేసీఆర్.. ఇప్పుడు సొంత బిడ్డ చేతికి చిక్కారు. ఇక, రాజకీయంగా కుటుంబాన్ని విభేదించిన కవిత.. టీఆర్ఎస్ పేరుతో పార్టీని ప్రారంభించి తన రాజకీయ ప్రస్థానంలో ఒక సాహసోపేతమైన మలుపు తీసుకున్నారు. కేవలం ఒక కొత్త పార్టీని స్థాపించడమే కాకుండా, తన తండ్రి కేసీఆర్ నిర్మించిన రాజకీయ పునాదుల పైనే ఎదిగేలా ఆమె రెడీ చేసుకున్న రూట్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులు తీసుకు రానుంది.

**తెలంగాణ ఆత్మ.. టీఆర్ఎస్ సొంతం**

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ గా మార్చే ఆలోచన ఉందని కేటీఆర్ చెప్పారు. దీనికి కారణం ప్రజలు బీఆర్ఎస్ పేరు మార్పుతో అనుబంధం కోల్పోయినట్లుగా ఫీలవుతున్నారని కూడా చెప్పారు. అయితే బీఆర్ఎస్ పార్టీని మళ్లీ టీఆర్ఎస్ గా మార్చేందుకు ఆసక్తి చూపించలేదు. ఇంతలోనే కవిత పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన గా ప్రకటించారు. దీని వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉంది. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణ సమాజంలో టీఆర్ఎస్ అనే బ్రాండ్ పట్ల ఉన్న సెంటిమెంట్ అనాథగా మారిందని ఆమె గుర్తించారు. ఇప్పుడు సేన పేరుతో ఆ పాత బ్రాండ్‌ను తిరిగి సొంతం చేసుకోవడం ద్వారా, తెలంగాణ అస్తిత్వానికి అసలైన వారసురాలిని తానే అని ప్రజలకు సంకేతం ఇచ్చారు. టీఆర్ఎస్ అంటే ఇప్పుడు నా పార్టీయే అనే అర్థం వచ్చేలా ఆమె చేసిన ప్రసంగం, ఉద్యమకారులను తనవైపు తిప్పుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది.

**రాజకీయ వారసత్వం నుండి విముక్తి**

తన ప్రసంగంలో కవిత ఎక్కడా తండ్రి పట్ల మమకారం చూపలేదు. కేసీఆర్ ఒకప్పుడు ఉద్యమ వీరుడని, కానీ ఇప్పుడు ఆయన కేవలం ఒక మరమనిషిగా మారిపోయారని వ్యాఖ్యానించడం ద్వారా ఆమె తన రాజకీయ దారిని స్పష్టం చేసుకున్నారు. కుటుంబ మిగతా 02లో



## ప్రజలకు చేరువగా

# ప్రజావాణి

### మండల స్థాయి వరకు విస్తరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు

- ఫిర్యాదుల పరిష్కారానికి డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్.. పారదర్శకతపై దృష్టి
- ప్రతి అర్జీకి గడువు.. ఆలస్యానికి అధికారులే బాధ్యత
- రియల్ టైమ్ మానిటరింగ్‌తో ప్రజావాణి బలోపేతం
- వికేంద్రీకరణతో పెండింగ్ ఫిర్యాదులకు చెక్..
- క్షేత్రస్థాయిలోనే పరిష్కారం సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున (2023 డిసెంబర్ 8వ తేదీన) ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ డివిజన్ స్థాయిలో.. తర్వత మండల స్థాయిలో**

వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని యోచిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆయన మిగతా 02లో


## అంతర్జాతీయ టెక్ మ్యాప్ లో విశాఖకు చోటు

### గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు విశాఖ జిల్లాలో శంకుస్థాపన




- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి - గిగా వాట్ సామర్థ్యంతో ఏర్పాటు
- ఈ నెల 28న తర్లువాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన
- గూగుల్ రాకతో విశాఖకు విశ్వఖ్యాతి - టెక్ కంపెనీల ఆసక్తి

10



## ట్రంప్‌పై కాల్పులు..

### తృటిలో తప్పిన ప్రమాదం

- కాల్పుల సమయంలో 2600 మంది అతిథులు
- వేదిక వద్దకు దూసుకొచ్చిన ఆగంతకుడు
- చేతిలో షాట్ గన్, కత్తులు
- అడ్డుకునేందుకు కాల్పులు
- ఓ సెక్యూరిటీ ఆఫీసర్ ను తగిలిన బుల్లెట్
- షూటర్ ఫొటోను విడుదల చేసిన ట్రంప్

02

# సర్కార్ కానుక

### ప్రతి నియోజకవర్గంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

- స్వయం ఉపాధికి బాటలు..
- నియోజకవర్గంలో వెయ్యి మందికి లబ్ధి
- మహిళా సాధికారతకు కొత్త దిశ..
- త్వరలో నోటిఫికేషన్..
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**


తెలంగాణ ప్రభుత్వం బలహీన వర్గాల మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం వినూత్న పథకాన్ని ప్రకటించింది. ప్రతి నియోజకవర్గానికి 1000 మంది మహిళల చొప్పున 100 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి సూచన మేరకు మహిళల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందని చెప్పారు. బీసీ మహిళల కోసమే బలహీన వర్గాల మహిళల మిగతా 02లో



## జీతాలు ఎంత

# పెరుగుతాయి?

### ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం ఫిట్‌మెంట్




- కండక్టర్, డ్రైవర్లకు రూ. 4 వేల నుంచి రూ. 10 వేలు
- ఐదేళ్ల బకాయిల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్
- 37 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం
- 9,600 రిటైర్డ్ సిబ్బందికీ వర్తింపు
- రూ.2,400 కోట్ల బకాయిల భారం..
- ఏడాదికి రూ.415 కోట్ల అదనపు వ్యయం
- ఆరు వారాల్లో వేతన లెక్కలు పూర్తి..

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ వేతన సవరణ వర్తించనుంది. దీనివల్ల సుమారు 37,360 మంది ప్రస్తుత ఉద్యోగులతో పాటు 9,600 మందికి పైగా విశ్రాంత ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నిర్ణయంతో సంస్థపై రూ.2,400 కోట్ల బకాయిల భారం పడనుండగా.. ఏటా అదనంగా రూ.415.2 కోట్ల వేతన వ్యయం పెరగనుంది. ఆరు వారాల్లో కొత్త వేతనాల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానుంది.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల చిరకాల వాంఛ నెరవేరింది. ప్రభుత్వం 11 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణను ఖరారు చేస్తూ కీలక ప్రకటన చేసింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో సుదీర్ఘంగా చర్చలు మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.04.2026
www.mudranews.in | @mudranews




**తరచూ నీళ్లు తాగండి**



శరీరం చల్లగా ఉండటానికి రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగండి.

# పునాదులపై రాజకీయ పోరు




(మొదటి పేజీ తరువాయి)
సభ్యురాలిగా గత పదేళ్ల పాలనలోని వైఫల్యాలకు క్షమాపణలు కోరడం ద్వారా, ఆమె ప్రజల ముందు ఒక క్లీన్ ఇమేజ్ తో రావాలని ఆశిస్తున్నారు. తండ్రి నీడ నుండి బయటకు వచ్చి, సొంతంగా ఎదిగే క్రమంలో ఆమె సెంటిమెంట్లను పక్కన పెట్టేసి అత్యంత వాస్తవిక రాజకీయాలను ఎంచుకున్నారు. సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ హయాంలో అణచివేతకు గురైన వర్గాలను ఉద్దేశించినవే. రైతులకు సంకెళ్లు, దళితులకు దెబ్బలు, ఫోన్ ట్యాపింగ్‌తో నిఘా నీడన బతుకులు.. ఇవేవీ మనం కోరుకున్న తెలంగాణ కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని, దానికి ప్రత్యామ్నాయంగా తాను ఒక ప్రజాస్వామ్యయుత వేదికను అందిస్తున్నానని ఆమె కన్విన్సింగ్‌గా చెప్పుకోగలిగారు. పార్టీలో తనను పక్కన పెట్టి, అవినీతి పరులైన పందికొక్కుల్ని కేసీఆర్ నెత్తిన పెట్టుకున్నారని కవిత చేసిన ఆరోపణ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. పార్టీని దోచుకునే వారికి ప్రాధాన్యత పెరిగిందని, నిబద్ధత గల వారికి స్థానం లేదని ఆమె మండిపడ్డారు. ఈ వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తన పార్టీ వైపు ఆకర్షించేందుకు ఆమె గట్టి పునాది వేశారు. తన టీఆర్ఎస్ లో పారదర్శకత ఉంటుందని, అవినీతికి తావుండదని హామీ ఇచ్చారు.

### మొదటి రోజే బీఆర్ఎస్‌కు షాక్

తెలంగాణ రాష్ట్ర సేనగా కవిత ప్రజల్లోకి వచ్చారు. పార్టీ ప్రకటించిన సందర్భంగా కేసీఆర్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే బానిస సంకెళ్లు పోతాయని అనుకుంటే వ్యక్తిగత స్వేచ్ఛ పోయిందని దుమ్మెత్తి పోశారు. విమర్శలు పక్కన పెడితే వస్తూ వస్తూనే బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. ఇకపై టీఆర్ఎస్‌గా మార్చుకునే వీలు లేకుండా చేశారు. 2023 ఎన్నికలకు ముందు దేశ రాజకీయాల్లో అడుగు పెట్టాలని టీఆర్ఎస్ పేరును కాస్తా బీఆర్ఎస్‌గా మార్చేశారు కేసీఆర్ అన్ని రాష్ట్రాల్లో పోటీ చేసి బీజేపీతో యుద్ధం చేయబోతున్నట్టు ప్రకటించారు. అయితే అదే పేరుతో ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయారు. దీంతో చాలా మంది విమర్శలు చేశారు. తెలంగాణతో ఉన్న సెంటిమెంట్ పోయిందని ఇది కూడా ఓటమికి ఒక కారణంగా విశ్లేషించారు.

### అమ్మతనంతో కొత్త అధ్యాయం

చివరగా, తాను ఒక అమ్మగా ప్రజల కష్టాలు తీరుస్తానని చెప్పడం ద్వారా ఆమె ఒక ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచుకున్నారు. బీఆర్ఎస్ ఒక కార్పొరేట్ సంస్థలా మారిందని, తన తెలంగాణ రాష్ట్ర సేన మాత్రం ఒక కుటుంబంలా ఉంటుందని ఆమె నమ్మించగలిగారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా తన అడుగులు వేస్తున్నారు. తెలంగాణ గడ్డపై ఇప్పుడు అసలైన టీఆర్ఎస్ పోరు మొదలైందని ఆమె చాటిచెప్పారు. కవిత రాజకీయంతో బీఆర్ఎస్ పార్టీకి చిక్కులు తప్పకపోవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### కొత్త పార్టీకి స్పేస్ ఉందా?

తెలంగాణ రాజకీయాల్లో కీలక అంకం మొదలైంది. ప్రస్తుతం త్రిముఖ పోటీ నెలకొంది. అధికారం కోల్పోయినా కేడర్ బలంగా ఉన్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్, పుంజుకుంటున్న బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం నడుస్తోంది. ఈ దశలో కవిత కొత్త పార్టీని ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయంగానే కనిపిస్తోంది. అయితే, తెలంగాణ రాజకీయాల్లో స్పేస్ ఎప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా సెంటిమెంట్, ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా ఉన్న గడ్డపై, గొంతు లేని వర్గాలకు, అసంతృప్త నేతలకు కవిత పార్టీ ఒక వేదికగా మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతిని అజెండాగా మార్చుకుంటే కొంత మేర ఓటు బ్యాంకును ఆకర్షించవచ్చు.

### సొంత ఇంటి నుంచే సవాల్?

కవిత నిర్ణయం అన్నిటికంటే ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీనే ప్రభావితం చేయనుంది. కేసీఆర్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న నేతలు లేదా పార్టీలో ప్రాధాన్యత దక్కని సెకండ్ లైన్ లీడర్లు కవిత వైపు చూసే అవకాశం ఉంది. పార్టీ పేరులో తెలంగాణ ఉంటుంది. ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చితే, అది పరోక్షంగా కాంగ్రెస్ , బీజేపీకి లాభం చేకూర్చవచ్చు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఆమె తీసుకుంటున్న ఈ అడుగు, తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకవచ్చు. కవిత తన తాజా వ్యాఖ్యల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. తెలంగాణలో జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాలను తన వైపు తిప్పుకోవడం ద్వారా బలమైన పునాది వేయాలని ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలు కూడా బీసీ మంత్రాన్ని జపిస్తున్న తరుణంలో, కవిత తెలంగాణ బిడ్డగా వారి ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తారనేది కీలకం. ఆమె పార్టీలో చేరబోతున్న మేధావులు, ఉద్యమకారుల జాబితాను బట్టి ఈ పార్టీ గమ్యం దిశానిర్దేశం అవుతుంది. తెలంగాణ జాగృతి ద్వారా దశాబ్ద కాలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవితకు క్షేత్రస్థాయిలో ఒక నెట్‌వర్క్ ఉంది. ఉద్యమ సమయంలో పనిచేసిన వారు, ప్రస్తుతం రాజకీయంగా అవకాశాలు లేనివారు ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె బలమైన అభ్యర్థులను నిలబెట్టి, ఒక పది నుంచి పదిహేను శాతం ఓట్లు సాధించగలిగితే.. రాష్ట్రంలో ఏ పార్టీ అయినా ప్రభుత్వ ఏర్పాటుకు ఆమె మద్దతు కోరాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే కింగ్ మేకర్ గా ఎదిగే అవకాశం ఆమెకు ఉంటుంది.

### పార్టీ పేరు మార్చాలని కేసీఆర్‌పై ఒత్తిడి

ప్రజల్లోకి మరోసారి టీఆర్ఎస్ పేరుతో వెళ్తే కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని నేతలు భావించారు. ఇదే విషయం చాలా కాలంగా చర్చ నడుస్తోంది. ఈ మధ్య కాలంలో బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చే డిమాండ్ గురించి ఆలోచిస్తున్నామని కేటీఆర్ అన్నారు. దీనిపై పార్టీ అధినేత కేసీఆర్ వద్ద చర్చించాల్సి ఉంటుందని కూడా అన్నారు.

### టీఆర్ఎస్ పేరుతో సిక్సర్ కొట్టిన కవిత

కేటీఆర్ ఇంకా చర్చల దశలోనే ఉండగానే కవిత సిక్సర్ కొట్టారు. వారికి ఉన్న ఆప్షన్‌ను ఎత్తుకుపోయారు. టీఆర్ఎస్ అనే పేరుతో ప్రత్యేకంగా పార్టీ పెట్టారు. ఆ టీఆర్ఎస్, ఈ టీఆర్ఎస్ వేరు అయినప్పటికీ ఇకపై అలాంటి పేరుతో పార్టీ రాకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీ ప్రారంభించిన మొదటి రోజే బీఆర్ఎస్‌కు ఇది షాకింగ్ విషయమని అంటున్నారు. ఒక వేళ ఒరిజినల్ తమదే అని టీఆర్ఎస్‌గా మార్చినా కవితకు, తరుల నుంచి వచ్చే విమర్శలకు భయపడి కేసీఆర్ తన పార్టీ పేరు మార్చారనే ప్రచారం జోరుగా సాగుతుంది. అక్కడ కూడా కవిత పైచేయి సాధించినట్టు అవుతుంది. అందుకే ఇకపై బీఆర్ఎస్ మార్పు అంశంపై పార్టీలో చర్చలేకుండా చేయనున్నారని టాక్. ఇప్పటికే చాలా సార్లు కేసీఆర్ పార్టీ పేరు మార్పు ఉండబోదని ప్రకటించారు. అయినా సమయం వచ్చినప్పుడల్లా కచ్చితంగా ఈ విషయం ప్రస్తావనకు వస్తూ ఉంది. ఇప్పుడు టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీ పెట్టినందున బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఆ విషయం జోలికి వెళ్లకపోవచ్చు. చాలా రోజు క్రితమే టీఆర్ఎస్ పేరుతో వస్తున్నానని హింట్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం టీఆర్ఎస్ ఓపెన్ ఆప్షన్‌లో ఉందని దాన్ని ఎవరైనా వాడుకోవచ్చని అన్నారు. అప్పుడే ఆమె టీఆర్ఎస్ పేరుతో వస్తుందని వార్తలు గుప్పుమన్నాయి. ఇదే విషయంపై బీఆర్ఎస్‌లో కూడా చర్చలు జరిగాయి. టీఆర్ఎస్ అంటే తెలంగాణ ప్రజలతో ఒక అటాచ్‌మెంట్ ఉందని, అదే పేరుతో కేసీఆర్ సొంతి ఇంటి నుంచే పార్టీ పెడితే ప్రమాదమని అనుకున్నారు. ఇప్పుడు అదే జరిగింది. ఇది కచ్చితంగా ఇంపాక్ట్ చూపిస్తుందని రాజకీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి దీనికి కౌంటర్‌గా కేసీఆరె ఎలాంటి వ్యూహాన్ని రచిస్తారో అన్న ఆసక్తి అందరిలో ఉంది.

# ప్రజలకు చేరువగా ప్రజావాణి

(మొదటి పేజీ తరువాయి)
ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించడంతో పాటు పరిష్కార పురోగతిని ఆ వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, తద్వారా అప్లికేషన్ పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని చెప్పారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని, అప్పుడే ప్రభుత్వం నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.

### ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం

ప్రజావాణి ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎస్, ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అధికారులకు ఆయన సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని సూచించారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే తక్కువ సమయంలోనే పలు సమస్యలు పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.





# మహిళలకు సర్కార్ కానుక

(మొదటి పేజీ తరువాయి)
ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళకు శుభవార్త చెబుతూ.. ఒక భారీ స్వయం ఉపాధి పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలనే లక్ష్యంతో.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 1000 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. నైపుణ్యం కలిగిన బీసీ మహిళలకు టైలరింగ్ ఆధారిత స్వయం ఉపాధి కల్పించి, వారి ఉత్పాదకతను పెంచి, టైలరింగ్ వ్యాపార అవకాశాలను విస్తరించుకునేందుకు, స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను సరఫరా చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది మహిళలు స్వయం ఉపాధిని పొంది, ఆర్థికంగా స్థిరపడే అవకాశం లభిస్తుందని అన్నారు.

### త్వరలోనే నోటిఫికేషన్

ఈ పథకం అమలు కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి, అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి పొన్నం ట్విట్టర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ మొత్తం జిల్లా కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరగనుందని చెప్పారు. కేవలం కుట్టు మిషన్ల పంపిణీకే పరిమితం కాకుండా.. మహిళలకు అవసరమైన ఇతర వనరులను కూడా సమకూర్చడం ద్వారా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నియోజకవర్గానికి 1000 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం ద్వారా ప్రతి ప్రాంతంలోనూ మహిళా సాధికారతకు బలమైన పునాది పడనుందని చెప్పారు.
బీసీ సంక్షేమ శాఖ ఈ పథకాన్ని కేవలం కుట్టు మిషన్ల పంపిణీగా మాత్రమే చూడటం లేదని.. దాంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా వివిధ వృత్తుల్లో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలకు అవసరమైతే ఆధునిక డిజైనింగ్, కుట్టు పనిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా శాఖా పరంగా చర్యలు తీసుకోనున్నట్లు కీలక ప్రకటన చేశారు.
కాగా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిరుపేద, బలహీన వర్గాల మహిళలకు ఒక భరోసా లభించినట్లయింది. ఇంటి దగ్గరే ఉంటూ ఆదాయాన్ని గడించే మార్గం సుగమం కావడంతో మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు ఈ పథకం ఒక వరంగా మారనుంది. మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం వేసిన ఈ అడుగు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# జీతాలు ఎంత పెరుగుతాయి?

(మొదటి పేజీ తరువాయి)
జరిపి ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. 2021 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ వేతన సవరణ అమలులోకి రానుండటంతో.. ఐదు సంవత్సరాల బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం వల్ల కండక్టర్లకు రూ. 4,000 నుంచి రూ.15,000 వరకు, డ్రైవర్లకు రూ.4,000 నుంచి రూ.17,000 వరకు నెలవారీ వేతనం పెరిగే అవకాశం ఉందని అంచనా. ఆర్టీసీ జేఏసీ ముందు ఉంచిన 32 డిమాండ్లలో వేతన సవరణ అత్యంత ప్రధానమైనది. తొలుత ప్రభుత్వం 10 శాతానికి ప్రతిపాదించినప్పటికీ.. కార్మిక నేతల పట్టుబట్టడంతో చివరకు 11 శాతానికి అంగీకరించింది. ఈ పెంపు వల్ల ఆర్టీసీపై భారీ ఆర్థిక భారం పడనుంది. 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిల కింద ప్రస్తుత ఉద్యోగులకు రూ.2,178 కోట్లు, విశ్రాంత ఉద్యోగులకు రూ.230 కోట్లు కలిపి మొత్తం రూ.2,400 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు లెక్కగట్టారు. దీనికి తోడు ప్రతి నెలా వేతనాల రూపంలో అదనంగా రూ.34.6 కోట్ల వ్యయం పెరగనుంది, అంటే సంవత్సరానికి దాదాపు రూ.415.2 కోట్ల అదనపు భారం సంస్థపై పడుతుంది.
బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. 2021, ఏప్రిల్ తర్వాత పదవీ విరమణ చేసిన వారికి బకాయిలను ప్రాధాన్యత క్రమంలో ముందుగా చెల్లిస్తారు.
అయితే.. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ బకాయిలను వారి పదవీ విర మణ సమయంలో చెల్లించాలని నిర్ణయించినట్లు సమాచారం. గతంలో కూడా ఇదే పద్ధతిని అనుసరించినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈ వేతన సవరణ ప్రక్రియను పక్కాగా అమలు చేసేందుకు ఉద్యోగుల నుంచి 'ఆప్షన్ ఫారాలు' సేకరించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది.
ఇంక్రిమెంట్ తేదీలు, ఇతర సాంకేతిక వివరాలను సేకరించే ఈ ప్రక్రియ సుమారు ఆరు వారాల పాటు కొనసాగనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి ఉద్యోగికి ఖచ్చితంగా ఎంత వేతనం పెరుగుతుందనే విషయంపై స్పష్టత వస్తుంది. ప్రస్తుతం సంస్థలో 37,360 మంది ఉద్యోగులు ఉండగా.. 2021 నుంచి ఇప్పటివరకు రిటైర్ అయిన 9,600 మందికి కూడా ఈ ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ కార్మిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.





# ట్రంప్‌పై కాల్పులు..

## వైట్ హౌస్ విందులో కలకలం, అతిథుల ప్రవర్తనపై విమర్శలు

ముద్ర, డెస్క్: వైట్ హౌజ్ కరస్పాండెంట్ డిన్నర్ సందర్భంగా వాషింగ్టన్ హిల్టన్ హోటల్ లో అనూహ్య గందరగోళం చోటుచేసుకుని అంతర్జాతీయంగా చర్చకు దారి తీసింది. ప్రముఖుల సమక్షంలో సాగుతున్న వేడుకలో ఒక్కసారిగా తుపాకీ కాల్పులను తలపించే శబ్దాలు వినిపించడంతో అతిథులు భయాందోళనకు గురయ్యారు.
సెకన్ల వ్యవధిలో హాల్‌లో గందరగోళం నెలకొంది. అతిథులు బయటకు పరుగులు తీయగా, భద్రతా సిబ్బంది ప్రముఖులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కొందరి వింత ప్రవర్తన విమర్శలకు దారితీసింది.
సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో ఒక మహిళ రెండు ఖరీదైన వైన్ బాటిల్స్ పట్టుకుని వెళ్లడం కనిపించగా, మరి కొందరు పరిస్థితిని పట్టించుకోకుండా మద్యం ఆస్వాదించడం, సెల్ఫీలు దిగడం గమనించబడింది.
ఈ ఘటనలో పాల్గొన్న వారిలో అనేక మంది జర్నలిస్టులే కావడంతో, అత్యవసర పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా ప్రవర్తించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. “ఇలాంటి సమయంలో సహాయం చేయడం మానేసి వ్యక్తిగత ఆసక్తులకు ప్రాధాన్యం ఇవ్వడం మీడియా నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది” అని నెటిజన్లు మండిపడుతున్నారు.

కాటన్ బట్టలు ధరించండి
సింథటిక్ బట్టలకంటే కాటన్ బట్టలు చెమటను తక్కువగా పెంచుతాయి, గాలి సులభంగా పాస్ అవుతుంది.





## శ్రీ నృసింహ జయంతి ఉత్సవాలు ప్రారంభం

- **మొదటిరోజు ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం**

ముద్ర, యాదగిరిగుట్ట :

యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. ఆదివారం ఉదయం శ్రీస్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీనృసింహ జయంతి మహోత్సవాల్లో భాగంగా, విష్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యాహవాచనము, ఋత్విగ్వరణము, కుంకుమార్చన, శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అలంకారసేవలో యాగశాలప్రవేశం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, మండప ద్వార తోరణ పూజ, అగ్ని ప్రతిష్ఠ, మూర్తికుంభ ఆరాధన, మూల మంత్ర మూర్తి మంత్ర హవనములు, నిత్య పూర్ణాహుతి మొదలగు వేడుకలను శ్రీపాంచరాత్రాగమ రీత్యా ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యాజ్ఞికబృందం, అర్చకులు, వేదపండితులు, పారాయణీకులు, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కార్యనిర్వాహణాధికారి జె. భవానీశంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఉపకార్యనిర్వహణాధికారి, సహాయకార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగసిబ్బంది, భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.



## భారత్ విశ్వరూపం

- **న్యూక్లియర్ రంగంలో భారత్‌కు ముందడుగు**
- **మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**


ముద్ర డెస్క్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన 133వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. భారత్ ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచంలో కీలక స్థానాన్ని సంపాదించుకుంటోందని, ముఖ్యంగా సివిల్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌లో భారత శాస్త్రవేత్తలు సాధిస్తున్న పురోగతి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంలో జరుగుతున్న పరిశోధనలు దేశ పరిశ్రమలు, ఆరోగ్య రంగం, శక్తి ఉత్పత్తి రంగాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని చెప్పారు. తమిళనాడులోని కల్పకం ఫాస్ట్ బ్రీడర్ రియార్టర్ క్రిటికాలిటీ దశను విజయవంతంగా దాటిన విషయంపై ప్రధాని ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీ ప్రపంచంలో చాలా కొద్ది దేశాలకు మాత్రమే అందుబాటులో ఉందని, భారత్ ఈ రంగంలో ముందంజలో ఉండటం గొప్ప విషయం అని అన్నారు. ఈ రియాక్టర్ ద్వారా అణుఇంధన వినియోగం మరింత సమర్థవంతంగా మారి, ఇంధన ఖర్చులు తగ్గే అవకాశాలు ఉన్నాయని వివరించారు. అలాగే పునరుత్పాదక శక్తి రంగంలో కూడా భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని మోదీ చెప్పారు. ముఖ్యంగా విండ్ పవర్ రంగంలో దేశం ముందుకు సాగుతోందని, పర్యావరణ హిత శక్తి వనరుల వినియోగం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు (బాంబూ) సాగును ప్రోత్సహించడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. దేశం సాంకేతికత, శక్తి, ఉపాధి రంగాల్లో సమతుల అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ఈ మార్గంలో శాస్త్రవేత్తలు, యువత కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు.

## ప్రతి ఊళ్లో పార్టీ జెండా ఎగురవేయండి

- **బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని పార్టీ స్పష్టం చేసింది. తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుందని, ఆహ్వానం ఉన్న వారు మాత్రమే హాజరుకావాలని, మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉదయాన్నే స్థానిక ప్రాంతాల్లో జెండా పండుగ ముగించుకుని, మధ్యాహ్నం 1:30 గంటలకల్లా హైదరాబాద్ చేరుకోవాలని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులకు సూచించారు.

# స్వీయ జనగణనకు శ్రీకారం

- **ఒక్క క్లిక్ తో సెన్సస్ సబ్మిట్**

ముద్ర, తెలంగాణ బ్యూరో :




రాష్ట్రంలోని ప్రధాన పట్టణ ప్రాంతం (క్యూర్) పరిధిలో 2027 స్వీయ జనగణన ఆరంభమైంది. మే 10వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రక్రియలో.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే జనగణన యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ 15 రోజుల వ్యవధిలో.. ఆయా మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల నివాసితులు తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చు. www.se.census.gov.in అనే అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వచ్ఛందంగా సమర్పించవచ్చు. ఈ ఉదయం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా.. ఈ లాంఛనంగా ప్రారంభించారు. స్వీయ గణనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో మొదటగా తన పేరు నమోదు చేసుకున్న వ్యక్తి.. ఆయనే. ఈ కార్యక్రమానికి సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్, ఇతర అధికారులు హాజరయ్యారు. మరిన్ని కనుగొనండి టెన్నిస్ పరికరాలు లైఫ్ స్టైల్ గైడ్ తెలుగు పుస్తకాలు రాజకీయ విశ్లేషణ కోర్సులు అంతర్జాతీయ వార్తలు ఏఐ కోర్సులు నగరంలో ప్రతి ఇంటిని లెక్కించేలా, పౌరులందరూ స్వయ గణనలో పాల్గొని, 2027 జనాభా లెక్కల కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సహకరించాలని ఈ సందర్భంగా గవర్నర్ శుక్లా, కమిషనర్ కర్ణన్ పిలుపునిచ్చారు. 2027 జనగణన దేశంలో మొట్టమొదటి పూర్తి స్థాయి డిజిటల్ సెన్సస్ అవుతుంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణకు ఇదే తొలి జనగణన కావడంతో పాటు ఇందులో కులం ఆధారిత గణన కూడా పొందుపరచనున్నారు. ఆన్‌లైన్ దశ అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే, గోడలపై గుర్తులు వేసే "హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్‌ఎల్‌ఓ)" నిర్వహిస్తారు. భారతి హొల్లికేరి, కర్ణన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పోర్టల్‌లో గృహాలు, ఆస్తులు, ఇంట్లో ఉండే సౌకర్యాలకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయి. తెల్లవారుజామున 6 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు నివాసితులు లాగిన్ అవ్వవచ్చు. ఎలాంటి పత్రాలు అవసరం లేదు. ఈ ప్రక్రియకు 1520 నిమిషాలు పడుతుందని అంచనా. వివరాలను సమర్పించిన తర్వాత, కుటుంబాలకు స్వీయ గణన ఐడీ వస్తుంది. ఆ వివరాలను ధృవీకరించడానికి జనాభా లెక్కింపు సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడీని తప్పనిసరిగా చూపాలి. టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1855 ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ గణన కోసం 21,866 సిబ్బంది, 3,662 మంది పర్యవేక్షకులను నియమిస్తారు. స్వీయగణన మహోత్సవ్ 15 రోజులు పేరుతో అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుంది.

# కొత్త భవన నియమావళి

- **5 నెలల్లో అందుబాటులోకి 'యూనిఫైడ్ బిల్డింగ్ రూల్స్'**
- **హెచ్ఎండీఏ సరికొత్త కసరత్తు**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



తెలంగాణలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం 'ఏకీకృత భవన నియమావళి'ని తీసుకువస్తోంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కసరత్తు మరో 3 నుంచి 5 నెలల్లో పూర్తి కానుంది. ఢిల్లీ, ముంబై వంటి నగరాల నిబంధనలను అధ్యయనం చేసి.. ఎఫ్ఎస్ఐ, ఎఫ్ఏఆర్ వంటి అంతర్జాతీయ ప్రమాణాలను మన వద్ద ప్రవేశపెట్టనున్నారు. ముఖ్యంగా ఒకే భవనంలో నివాస, వాణిజ్య కార్యకలాపాలకు అనుమతినిచ్చే వర్టికల్ మిక్స్ విధానం ఈ కొత్త కోడ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది. భవన నిర్మాణ రంగం సరికొత్త మలుపు తిరగబోతోంది. ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ నిబంధనలను హేతుబద్ధీకరించి, సరళీకృతం చేసే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఏకీకృత భవన నియమావళికి రూపకల్పన చేస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాబోయే 3 నుంచి 5 నెలల్లో ఈ కొత్త నిబంధనలను అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కోడ్ తయారీ కోసం అధికారులు ఢిల్లీ, ముంబై, చండీగఢ్, నయా రాయ్‌పూర్ వంటి భారతీయ నగరాలతో పాటు పలు అంతర్జాతీయ నగరాల్లో అమల్లో ఉన్న నిబంధనలను లోతుగా అధ్యయనం చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ, డీటీసీపీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల విధానం వేర్వేరుగా ఉంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఈ రెండు విభాగాల అనుమతుల విధానాన్ని ఏకీకృతం చేయనున్నారు. అంటే రాష్ట్రవ్యాప్తంగా లేఅవుట్లు, ఓపెన్ స్పేస్, సెట్‌బ్యాక్, అంతర్గత రోడ్లు, పార్కింగ్ వంటి మౌలిక వసతుల కల్పనలో ఒకే రకమైన ప్రామాణిక విధానం అమల్లోకి వస్తుంది. ముంబైలో అమల్లో ఉన్న ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్, ఢిల్లీలో ఉన్న ఫ్లోర్ ఏరియా రేషియో వంటి పద్ధతులను ఇక్కడ కూడా ప్రవేశపెట్టేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీనివల్ల బిల్డర్లకు, సామాన్య ప్రజలకు నిర్మాణ వ్యయంపై ముందస్తు అంచనా రావడమే కాకుండా పారదర్శకత పెరుగుతుంది. ఈ కొత్త నియమావళిలో అత్యంత కీలకమైన అంశం వర్టికల్ మిక్స్ విధానం. ప్రస్తుతం బహుళ అంతస్తుల వాణిజ్య భవనాల్లో కేవలం వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే అనుమతి ఉంది. దీనివల్ల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ మినహా మిగతా అంతస్తులకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. కానీ వర్టికల్ మిక్స్ విధానం అమల్లోకి వస్తే.. ఒకే భవనంలో కింది అంతస్తుల్లో వాణిజ్య సంస్థలు, పై అంతస్తుల్లో నివాస గృహాలు లేదా కార్యాలయాలకు అనుమతిస్తారు. దీనివల్ల భూమి వినియోగం పెరగడమే కాకుండా, నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నివాసం, పని ప్రదేశం ఒకే చోట ఉండటం వల్ల వాక్‌టువర్క్ సంస్కృతి బలపడుతుంది. అంతేకాకుండా.. గ్రౌండ్ కవరేజ్‌పై కూడా స్పష్టమైన ఆంక్షలు, సరళీకరణలు ఉండనున్నాయి. 10 అంతస్తుల పైబడిన భవనాలకు హెచ్ఎండీఏ అనుమతులు, అంతకంటే తక్కువ ఉన్న వాటికి కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే విధానంలో కూడా మరింత స్పష్టత తీసుకురానున్నారు. ఈ ఏకీకృత నియమావళి అమల్లోకి వస్తే.. నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు హైదరాబాద్ వంటి నగరాల రూపురేఖలు మరింత ఆధునికంగా మారతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.




## విద్య, నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

- **తెలంగాణ సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకం**
- **చండీగఢ్‌లో చింతన్ శివిర్‌లో పాల్గొన్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్**

ముద్ర, చండీగఢ్:

విద్య నైపుణ్య అభివృద్ధి తో బలహీన వర్గాల ఉపాధి అవకాశాలు విస్తరణ చేయడం వల్ల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "చింతన్ శివిర్" సదస్సు ఆదివారం హర్యానా రాష్ట్రం లోని చండీగఢ్‌లో జరిగింది. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరపున సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి వంటి కీలక అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. తెలంగాణతో పాటు ఉత్తర ప్రదేశ్, నాగాలాండ్, ఒడిశా, మేఘాలయ, అస్సాం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఉప సంచాలకులు చింతనతో శివిర్ లో పాల్గొన్నారు. సదస్సు లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు సూచనలు చేశారు. సామాజిక న్యాయ రంగంలో కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్లో మరిన్ని నిధులు కేటాయించి వారి సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాల విస్తరించి బలహీన వర్గాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగవంతం కోసం డిజిటల్ విధానాలను విస్తృతంగా వినియోగించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వినూత్న సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ చింతన్ శివిర్ ద్వారా రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలను అమలుకు అలాగే కార్యాచరణలో సమన్వయం సాధించేందుకు ప్రయోజనకరమైన వేదికగా నిలిచిందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

# వంట నూనెల కల్తీ దందాకు చెక్

- **లూజు నూనె విక్రయాలు నిషేధం**
- **ప్రభుత్వం కీలక నిర్ణయం**
- **వ్యాపారులకు 15 రోజుల గడువు ఇచ్చిన హెచ్‌ఫాస్ట్**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



తెలంగాణలో ఆహార ఉత్పత్తుల కల్తీ తీవ్ర సమస్యగా మారుతోంది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. కల్తీ నూనెలు భారీ మొత్తంలో పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో విడిగా వంట నూనెలను విక్రయించడంపై నిషేధం విధించింది. 15 రోజుల్లోగా విడి నూనెల అమ్మకాలను నిలిపేయాలని వ్యాపారులను ఆదేశించింది. ఇక నుంచి ప్యాకెట్లు, టిన్‌లలో మాత్రమే వంట నూనెలను విక్రయించాలని వ్యాపారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆహార పదార్థాల కల్తీ సమస్య తెలంగాణలో తీవ్రమవుతోంది. కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా కల్తీరాయుళ్లు రెచ్చిపోతున్నారు. టీపొడి, మంచి నూనె, కొబ్బరి నూనెలు, టూత్ పేస్టులు.. ఇలా అన్ని రకాల వస్తువులను కల్తీ చేస్తున్నారు. ఇక వంట నూనెలను అయితే ఇష్టం వచ్చినట్లు కల్తీ చేస్తున్నారు. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఇటీవల భారీ మొత్తం కల్తీ నూనెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్ ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అనాలిసిస్ అండ్ సర్వైలెన్స్ టీమ్) కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో లూజ్ (విడి)గా వంట నూనెలు విక్రయించడాన్ని నిషేధించింది. ఇక నుంచి ప్యాకెట్లు, డబ్బాల్లో మాత్రమే వంట నూనెను విక్రయించాలని ఆదేశించింది.

**డెడ్ లైన్ 15 రోజులు**

విడిగా నూనె విక్రయాలను ఆపేయడం కోసం వ్యాపారులకు సౌత్ జోన్ డీసీపీ, హెచ్‌ఫాస్ట్ ఇంఛార్జ్ అయిన గైక్వాడ్ వైభవ్ 15 రోజుల గడువు ఇచ్చారు. ఈలోగా సీల్ చేసిన, బ్రాండెడ్ ఉత్పత్తుల వైపు మళ్లాలని వ్యాపారులను ఆదేశించింది. నూనె రిఫైనరీలు, నిల్వ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని.. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఆయన సూచించారు. 15 రోజుల డెడ్ లైన్ ముగిసిన తర్వాత కూడా ఖుల్లాగా వంట నూనెలు విక్రయించే వారిపై భారత న్యాయ సంహిత, ఫుడ్ సేఫ్టీ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్‌ఫాస్ట్ ఇంఛార్జ్, డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హెచ్చరించారు. బేగం బజార్‌లోని నూనె వ్యాపారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు ఇక నుంచి వంట నూనెలను సీల్ చేసిన ప్యాక్‌లు, టిన్నుల్లో మాత్రమే విక్రయించాలి. అలాగే తయారు చేసిన తేదీ, ఎప్పటిలోగా వాడాలి, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలను తప్పనిసరిగా పేర్కొనాలి. వంట నూనెల కల్తీకి పాల్పడిన వారు జైలుకు వెళ్లాల్సి వస్తుంది, వారి లైసెన్స్ కూడా రద్దవుతుంది. తక్కువ ధరలకు వస్తున్నాయనే ఆశకు పోయి వినియోగదారులు విడిగా లభించే వంట నూనెలను కొనుగోలు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. విడిగా లభించే వంట నూనెలను కల్తీ చేయడానికి అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఆర్జిమోన్ నూనె అనేది అచ్చం ఆవ నూనెలాగే ఉంటుంది. చౌకగా దొరికే ఈ నూనెను ఖరీదైన ఆవ నూనెలో కలుపుతుంటారు. అలాగే తక్కువ ధరకే దొరికే పామ్ ఆయిల్‌ను ఖరీదు ఎక్కువగా ఉండే వేరుశనగ, పొద్దుతిరుగుడు నూనెల్లో కలిపి కల్తీ చేస్తుంటారు. హోటళ్లు, ఫంక్షన్లలో పదే పదే మరిగించిన నూనెను కొనుగోలు చేసి రసాయనాలతో శుద్ధి చేసి, కొత్త నూనెలలో కలిపి విక్రయించేవారు కూడా ఉంటారు. కల్తీ నూనెలు వాడటం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, లివర్ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకర ప్రాణాంతక వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంటుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
27.04.2026 సోమవారం, హైదరాబాద్



## వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## కామెర్ల వ్యాధి.. నివారణ చర్యలు

కామెర్లు (Jaundice) అనేది రక్తంలో బిలిరుబిన్ స్థాయిలు పెరగడం వల్ల చర్మం మరియు కళ్లలో పసుపు రంగు కనిపించే పరిస్థితి. కామెర్లు స్వతంత్రంగా ఒక వ్యాధి కాదు — ఇది శరీరంలో, ముఖ్యంగా కాలేయం (లివర్), రక్తం లేదా పిత్త ప్రవాహ వ్యవస్థలో ఏదో సమస్య ఉందని తెలియజేసే ఒక సంకేతం మాత్రమే.

**కామెర్లకు ప్రధానంగా మూడు రకాల కారణాలు ఉంటాయి:**

1. ప్రీహెపాటిక్ కారణాలు (కాలేయానికి ముందు)

ఇవి ఎర్ర రక్త కణాలు (RBCs) అధికంగా విచ్ఛిన్నం కావడం వల్ల ఏర్పడతాయి. దీంతో బిలిరుబిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది.

* హీమోలిటిక్ అనీమియా
* హెరిడిటరీ స్ఫిరోసైటోసిస్
* సికిల్ సెల్ అనీమియా
* థలసేమియా
* G6PD లోపం
* ఆటోఇమ్యూన్ హీమోలిటిక్ అనీమియా
* రక్త మార్పిడి (ట్రాన్స్‌ఫ్యూషన్) ప్రతిక్రియలు

**2. హెపాటిక్ కారణాలు (కాలేయం లోపల)**

కాలేయం దెబ్బతినడం వల్ల బిలిరుబిన్‌ను సరిగా ప్రాసెస్ చేయలేని పరిస్థితి.

* హెపటైటిస్ (హెపటైటిస్ A, B, C, E ఎక్కువగా కనిపిస్తాయి; డెంగ్యూ, CMV, HSV వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా కారణం కావచ్చు)
* సిర్రోసిస్
* మద్యం వల్ల కలిగే కాలేయ వ్యాధి
* నాన్‌అల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (NAFLD)
* గిల్బర్ట్ సిండ్రోమ్, క్రిగ్లర్‌నజ్జార్ సిండ్రోమ్ వంటి జన్యుపరమైన వ్యాధులు
* లివర్ క్యాన్సర్
* మందుల వల్ల కలిగే హెపటైటిస్
* విల్సన్ వ్యాధి

**3. పోస్ట్-హెపాటిక్ కారణాలు (కాలేయం తర్వాత)**

కాలేయం నుంచి పిత్తం బయటకు వెళ్లే మార్గంలో అడ్డంకి ఏర్పడినప్పుడు.

* గాల్ స్టోన్స్ (పిత్త రాళ్లు)
* కోలెసిస్టైటిస్ (పిత్తాశయ వాపు)
ప్యాంక్రియాస్ క్యాన్సర్
* బిలియరీ అట్రేసియా
* ప్రైమరీ స్క్లెరోసింగ్ కొలాంగైటిస్
* ప్రైమరీ బిలియరీ కొలాంగైటిస్
* పిత్త నాళాల సంకోచం (స్ట్రిక్చర్స్)

ఒక ముఖ్యమైన సందేశం

కామెర్లకు అనేక కారణాలు ఉండవచ్చు. కాబట్టి కామెర్లు వచ్చినప్పుడు ముందుగా అసలు కారణం ఏమిటో ఖచ్చితంగా గుర్తించడం చాలా ముఖ్యం. కారణం తెలిసిన తర్వాత మాత్రమే సరైన చికిత్స ఇవ్వవచ్చు.

కామెర్లపై ప్రజల్లో అవగాహన పెరగాలి. చాలా మంది ఏ రకమైన కామెర్లైనా ప్రత్యామ్నాయ వైద్యం లేదా నిర్ధారణ లేని మందులతో నయం అవుతుందని భావిస్తారు. ఇది చాలా ప్రమాదకరం.

ఇలాంటి మందులు సరైన చికిత్స ఆలస్యం చేయడమే కాకుండా, కాలేయానికి మరింత నష్టం కలిగించవచ్చు. అంతేకాకుండా మూత్రపిండాలు (కిడ్నీలు), ఎముక మజ్జ (బోన్ మారో) వంటి ముఖ్యమైన అవయవాలకు కూడా హాని కలిగించవచ్చు.

కామెర్లు అనేది శరీరం ఇచ్చే ఒక హెచ్చరిక సంకేతం. దాన్ని నిర్లక్ష్యం చేయకండి. స్వయంగా మందులు వాడకండి. సరైన వైద్య పరీక్షలు చేయించుకుని, అసలు కారణాన్ని తెలుసుకుని, అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందండి.

సమయానికి గుర్తిస్తే కాలేయాన్ని కాపాడవచ్చు, ఇతర అవయవాలను రక్షించవచ్చు, ప్రాణాలను నిలబెట్టవచ్చు.


—డాక్టర్ కె. ఎస్. సోమశేఖర్ రావు
క్లినికల్ డైరెక్టర్
సీనియర్ కన్సల్టెంట్
జీర్ణమండల మరియు కాలేయ వ్యాధుల విభాగం
యశోద హాస్పిటల్,
హైటెక్ సిటీ, హైదరాబాద్





## కవన తృష్ణ


కవనవీధిలో తిరగాలని ఉన్నది—
కలల కాంతుల వెంట కదలాలని ఉన్నది;
అక్షరాల అడుగుజాడల్లో
అంతరంగ స్వరాలు వినిపించాలని ఉన్నది॥
కవనరాజ్యము ఏలాలని ఉన్నది—
భావాల సింహాసనం అధిరోహించి;
పదాల పుష్పాలతో పండుగ చేస్తూ
ప్రపంచాన్ని పరిమళింపజేయాలని ఉన్నది॥
కవనసృష్టిని చేయాలని ఉన్నది—
కల్పనకు రెక్కలు కట్టి ఎగరాలని;
మౌనంలో మోగే సంగీతాన్ని
మాటలలో మలచాలని ఉన్నది॥
కవనకడలిలో ఈదాలని ఉన్నది—
కలతల కెరటాలను ఆలింగనం చేసుకుంటూ;
ఆలోచనల లోతుల్లో దాగిన
అమృత ముత్యాలను సేకరించాలని ఉన్నది॥
కవనాకాశంలో విహరించాలని ఉన్నది—
నక్షత్రాల నడుమ నవ్వుతూ సాగాలని;
వెన్నెలలో వాక్యాల వలయాలు వేసి
విశ్వాన్నే వేదికగా మార్చాలని ఉన్నది॥
కవనానందం పంచాలని ఉన్నది—
హృదయాల తలుపులు తట్టే హారతిలా;
చీకట్లలో చినుకులా జారి
చిరునవ్వులు చిగురించాలని ఉన్నది॥
కవనామృతమును త్రాగాలని ఉన్నది—
ప్రతి పాదంలో పరిమళం ఆస్వాదిస్తూ;
అక్షరాల ఆహ్లాదంలో మునిగి
ఆత్మను ఆనందింపజేయాలని ఉన్నది॥
కవనసేద్యము సాగించాలని ఉన్నది—
భూమిలా భావాలను జల్లుతూ;
కాలమే పంటగా మార్చి
కీర్తి ఫలాలను అందించాలని ఉన్నది॥
ఇదే నా కవన తృష్ణ—
అక్షరాల్లో జీవించాలనే
ఆకాంక్ష!
పదాల్లో పవళించాలనే
పేరాశ!
సాహిత్యంలో వెలిగిపోవాలనే తపన!



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

## కావ్యాల్లో కరుణ రసం

* **నన్నయ్య నుండి తిక్కన వరకు ఒక పరిశీలన.**



సాహిత్యంలో నవరసాలు మానవ జీవితాన్ని ప్రతిబింబించే అద్దాలు. వీటిలో 'కరుణ రసం' అత్యంత హృద్యమైనది, అనిర్వచనీయమైనది. శృంగారం, వీరం వంటి ఇతర రసాలు పాఠకుడిని ఉత్సాహపరిస్తే, కరుణ రసం మాత్రం మనసును కదిలించి, సహానుభూతిని కలిగిస్తుంది. తెలుగు సాహితీ క్షేత్రంలో నన్నయ్య నుండి తిక్కన వరకు కావ్యాల్లోని కరుణ రస స్వరూపాన్ని పరిశీలిస్తే, ఆది కవి నన్నయ్యలో కనిపించే సంయమనం, యుగకర్త తిక్కనలో కనిపించే నాటకీయత ఒక గొప్ప పరిణామాన్ని చూపుతాయి.

నన్నయ్య: సంయమనంతో కూడిన కవితాత్మక కరుణ

నన్నయ్య భట్టు 'ఆదికవి'గా తెలుగు సాహిత్యానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆయన కవిత్వంలో 'అక్షర రమ్యత' ఉంటుంది. నన్నయ్య కరుణ రసాన్ని చిత్రించడంలో ఒక ప్రత్యేకమైన సంయమనాన్ని, హుందాతనాన్ని పాటిస్తారు. ఆయన వర్ణనలు ఎప్పుడూ అత్యున్నతమైన ధర్మానికి లోబడి ఉంటాయి. నన్నయ్య కరుణ రసం 'ఆలంకారికమైనది'.

ఉదాహరణకు, శకుంతల కథలో శకుంతల తన పుట్టింటిని, తండ్రిని వదిలి వెళ్లే సన్నివేశాన్ని తీసుకుంటే, అక్కడ ఒక విధమైన 'ఆత్మీయ విషాదం' కనిపిస్తుంది. కణ్వ మహర్షి శకుంతలను సాగనంపేటప్పుడు ఆమె పడే వేదనను, ఆశ్రమంలోని పక్షులు, మృగాలు పడే విరహాన్ని నన్నయ్య వర్ణించిన తీరు ఎంతో సుకుమారంగా, హృదయ స్పర్శిగా ఉంటుంది. ఇక్కడ కరుణ అనేది కేవలం కన్నీటి బొట్టు కాదు, అది ఒక రకమైన 'వియోగ వేదన'. నన్నయ్య తన కవిత్వంలో కరుణను చిత్రించేటప్పుడు ఆ పాత్రల వ్యక్తిత్వాలను దెబ్బతీయరు. కష్టాల్లో ఉన్నా, ఆ పాత్రల ప్రవర్తనలో ఒక గాంభీర్యం ఉంటుంది. నలుడుదమయంతి కథలో, దమయంతి తన భర్త కోసం అడవుల్లో వెతికే సందర్భంలో నన్నయ్య పదాల ఎంపిక ఎంతో లాలిత్యంగా ఉంటుంది. ఆయన పాఠకుడిని ఏడిపించడం కంటే, ఆ పరిస్థితిలోని విషాద తీవ్రతను పాఠకుడికి ఒక కవితాత్మక దృక్పథంతో పరిచయం చేయడంపైనే దృష్టి పెడతారు.

తిక్కన: మానవీయ కోణంలోని నాటకీయ కరుణ

తిక్కన 'ఉభయకవి మిత్రుడు'. ఆయన కవిత్వంలో 'నాటకీయత' ప్రధానమైనది. నన్నయ్య కరుణ రసాన్ని ఒక కావ్యాత్మక దృక్కోణం నుండి చూస్తే, తిక్కన దానిని ఒక 'మానవీయ' దృక్కోణం నుండి చూస్తారు. తిక్కన కరుణ రసం చాలా గాఢంగా, మనస్తత్వ శాస్త్రానికి అత్యంత దగ్గరగా ఉంటుంది.

తిక్కన రచించిన 'స్త్రీ పర్వం' భారతంలోనే కరుణ రసానికి నిదర్శనం. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత, రణరంగంలో పడి ఉన్న తమ భర్తలు, పుత్రులు, సోదరులను చూసి స్త్రీలు పొందే వేదనను తిక్కన చిత్రించిన తీరు అద్వితీయం. ముఖ్యంగా 'గాంధారి విలపం' ఈ కరుణ రసానికి శిఖరాగ్రం. తన వందమంది కుమారులను కోల్పోయిన తల్లిగా గాంధారి పడే ఆవేదనను తిక్కన కళ్ళకు కట్టినట్టు చూపిస్తారు. గాంధారి కృష్ణభగవానుడిని ఉద్దేశించి చేసే విమర్శ, తన కుమారుల మరణానికి విలపించే తీరు చదువుతుంటే ఇప్పటికీ పాఠకుల కళ్లు చెమరుస్తాయి.

తిక్కన కరుణ రసంలో పాత్రల ఆవేదన నేరుగా పాఠకుడికి తగులుతుంది. ఆయన సన్నివేశాలను నిర్మించడంలో, పాత్రల సంభాషణలను రాయడంలో చూపే చాతుర్యం వల్ల, ఆ బాధ కేవలం పాత్రలది మాత్రమే కాదు, పాఠకుడిది కూడా అనిపిస్తుంది. తిక్కన పాత్రల మనసులోకి చొచ్చుకుపోయి, వారిలోని అంతర్మథనాన్ని అక్షర రూపంలో పలికిస్తారు. ఇది కేవలం వర్ణన కాదు, ఇది 'అనుభవజన్యమైన కరుణ'. యుద్ధం అనేది ఎంతటి భయంకరమైనదో, విజయానికి ఇచ్చే మూల్యం ఎంతటిదో తిక్కన ఈ ఘట్టాల్లో అద్భుతంగా ఆవిష్కరించారు.

**పరిశీలన - మార్పులు**

నన్నయ్య నుండి తిక్కన వరకు కరుణ రస ప్రయాణంలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది

శైలి: నన్నయ్య కరుణ రసం వర్ణనాత్మకం (Descriptive), తిక్కన కరుణ రసం నాటకీయకం (Dramatic). నన్నయ్య దృశ్యాలను వివరిస్తే, తిక్కన దృశ్యాలను పాఠకుడి కళ్లముందు ఉంచి, పాత్రలతో కలిసి వేదనను అనుభవించేలా చేస్తారు.

ప్రభావం: నన్నయ్య పాఠకుడిని ఒక లోతైన ఆలోచనలో పడేసే కరుణను అందిస్తే, తిక్కన పాఠకుడిని తీవ్రమైన భావోద్వేగానికి లోను చేసే కరుణను అందిస్తారు.

ప్రయోజనం: నన్నయ్య కరుణ రసం ద్వారా పాత్రల ధర్మాన్ని, ఆదర్శాన్ని నిలబెడితే, తిక్కన ఆ పాత్రల ద్వారా మానవ స్వభావాన్ని, ప్రపంచంలోని నశ్వరత్వాన్ని, యుద్ధంలోని వ్యర్థాన్ని పాఠకులకు చూపిస్తారు.

నన్నయ్య నుండి తిక్కన వరకు తెలుగు సాహిత్యంలో కరుణ రసం పరిణామం చెందింది. నన్నయ్య అందించిన 'కవితాత్మక కరుణ'కు, తిక్కన తన 'నాటకీయ కరుణ'ను జోడించడం వల్లనే మన మహాభారతం ప్రాణవంతమైంది. ఈ ఇద్దరు కవుల శైలులు భిన్నమైనా, వారిద్దరూ కరుణ రసాన్ని పండించడంలో ఒకే లక్ష్యాన్ని కలిగి ఉన్నారు అది పాఠకుడి హృదయంలో మానవీయ స్పందనను పెంపొందించడం. కరుణ రసం అనేది కేవలం దుఃఖం కాదు, అది ఎదుటివారి బాధను అర్థం చేసుకోగల గొప్ప శక్తి అని ఈ మహాకవులు తమ కావ్యాల ద్వారా నిరూపించారు. నన్నయ్యతిక్కనల ఈ కరుణ రస చిత్రణ, నేటికీ పాఠకులను మానవతావాదులుగా మార్చే ఒక అక్షర శక్తిగా కొనసాగుతోంది. సాహిత్యం మనిషిని కేవలం రంజింపజేయడమే కాకుండా, ఎదుటివారి కష్టాన్ని పంచుకునే హృదయాన్ని ఎలా ఇస్తుందో ఈ కావ్య పఠనం ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

-కాళేశ్వరం కృష్ణమూర్తి,
తెలుగు భాషా బోధన విషయ నిపుణులు,
హన్మకొండ.
9705196097.



## అమ్మా..అమ్మా.. జయలలితలా కవితమ్మ!

తమిళనాడును ఏలిన దివంగత ముఖ్యమంత్రి జయలలితను అక్కడి ప్రజలు అమ్మా అని పిలిచేవారు, కొలిచేవారు. పురచ్చితలైవి (అంటే పురోగామి, విప్లవాత్మకమైన నాయకురాలు)గా భారత దేశ రాజకీయాల్లో సుప్రసిద్ధురాలైన జయలలితను ఇప్పటికీ అమ్మ అనే తలుస్తారు. మన దేశంలో మహిళా ముఖ్యమంత్రులు తక్కువే. అందునా దక్షిణ భారతదేశంలో పాలనాధీశురాలిగా తమిళనాట జయలలిత తనదైన గట్టి ముద్ర వేశారు. జయలలిత నేరుగా దర్శనం ఇచ్చినా, తన ఫొటోలు కనిపించినా చేతులు జోడించి (ముకుళిత హస్తాలు) దేవుళ్ళకు ప్రార్థన చేసినట్లు దండం పెట్టేవారు. సాష్టాంగ నమస్కారమూ చేసే వారు. జయలలితలో అమ్మను చూసుకునే వారు. తమిళనాట సాధారణ వ్యక్తులు మొదలు ఎంతటివారిలోనైనా అంతటి భక్తి, భయం, అభిమానం, ఆదరణ ఉండేవి. జయలలిత కట్టూ బొట్టూ, జడ కొప్పు (శిఖ), ప్రసన్న వదనాలతో మొత్తంగా ఆహార్యం దైవ సమానురాలైన అమ్మలా ఉంటుండె. తమిళనాడు ప్రజల సంక్షేమం కోసం వివిధ పథకాలతో ముఖ్యమంత్రిగా జయలలిత అమ్మ అయ్యారు. అమ్మతనం ఉట్టిపడే పురచ్చితలైవి మాదిరి సింపుల్ ఆహార్యంతో కవిత తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)పార్టీగా నామకరణాన్ని వెల్లడించారు.

సంస్కృతంలోనిదైన సేన అనే అంత్య పదం సైన్యం, దళం వంటి అర్థాలతో పోరాట సూచికలకు చిహ్నం. స్ఫూర్తి, ప్రేరణ రగిల్చేది. అంటే, తమ రాజకీయాల్లో పోరాటాలూ మిళితమై ఉంటాయనేది పార్టీ పేరులోనూ ప్రతిఫలిస్తుంది. తమిళనాడులో జయలలిత కూడా ఎన్నో పోరాటాలు చేశారు. ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొన్నారు. నిజానికి గడిచిన 11 నెలల కాలంలో తెలంగాణ వ్యాప్తంగా పర్యటించినపుడూ అలానే జయలలిత తరహా ఆహార్యాన్నే కవిత అనుసరించారు.

పార్టీ ప్రకటనోత్సవంలోనూ అలాగే తెలంగాణ సమాజం ముందుకు వచ్చారు. తల్లి పిల్లల జేబులు కాకుండా కడుపు చూస్తుందనే గొప్పదైన సహజ నానుడిని కవిత ఉటంకించారు. తాను కూడా తెలంగాణ సమాజానికి అమ్మలా పరిణితి చెందాలని భావిస్తున్నట్టు ఉపన్యాసంలో పేర్కొన్నారు. ఒక అమ్మలా తెలంగాణ ప్రజల బాగోగులు, సంక్షేమానికి పాటుపడతానని మాతృత్వ మధురిమలంతటి సందేశం ఇచ్చారు. జీవం తొణికిసలాడే ప్రశాంతమైన నదీ ప్రవాహంలా నమోదైన ప్రసంగంలో అమ్మ అనే పదాన్ని శ్రావ్యంగా భావోద్వేగమైన శబ్ద తరంగాలతో ఉటంకించారు.

ఆద్యంతం ఆకట్టుకుని, ఆలోచింపజేసేలా కొనసాగిన స్పీచ్ అంతా తన మదిలోంచి అలవోకగా ఉబికి వచ్చింది. ఎక్కడా పెన్నూ, పేపరు, పాయింట్ల నోట్ తో పని లేకుండా.. ప్రసంగ పాఠాన్ని చూస్తూ కాకుండా కంఠస్థంగా, మనసు పొరల్లోంచి జాలు వారడం ఆశ్చర్యం, ఆసక్తి కలిగించింది.

అనేక అంశాలపై కంఠతః మాట్లాడుతూ తనలోని ఆత్మవిశ్వాసం, స్థితప్రజ్ఞత, ప్రజ్ఞనూ కళ్ళకు కట్టారు. ఎటువంటి తడబాటు లేకుండా చెవులూరించేలా వినసొంపుగా ప్రసంగించారు.

విషయ పరిజ్ఞానంపై తన పట్టును అంతటి కీలక వేదికపైనా నిలబెట్టుకున్నారు.

తమ పార్టీ విధానాల్లో పాంచజన్య సమాహారంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయానికి అగ్ర స్థానం ఉంటుందని ప్రజల్లోకి లోతుగా చేరేలా చెప్పారు. ఇప్పటికిప్పుడు ప్రతిపక్షమై, రాబోయే ఎన్నికల నాటికి అధికార పక్షంగా ఎదగగలమని దీమా నోటి నిండా ధ్వనించింది.

ప్రజలకు మేలు చేసేందుకు రాజకీయ అధికారం కచ్చితంగా అవసరమని నిర్మొహమాటంగా తేల్చి చెప్పారు. మున్ముందు జరుగాల్సిన పరిషత్ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎలక్షన్లలో తెలంగాణ రాష్ట్ర సేన పూర్తి స్థాయిలో పోటీ చేస్తుందంటూ శ్రేణుల్లో సరికొత్త ఆశలు జనింపజేశారు. మరో కొత్త పార్టీ తమ ముందుకు వస్తుండడం జనంలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

తెలంగాణ అమ్మలా కలకాలం స్థిరపడాలనే ఆకాంక్ష, అభిలాష కవిత అంతరంగమై ప్రతిధ్వనించింది. ఆహూతులు, అభిమానులు సీఎం సీఎం అంటూ నినదించడంలోనూ, రాజకీయ అధికారం కావాలని కవిత అనడంలోనూ తదుపరి తన భవిష్యత్ లక్ష్యం ఏమిటో నిర్ధారణ అయింది. కవితక్కను ఇకపై కవితమ్మ అని సంబోధించడమే తన మనోగతానికి దగ్గరగా ఉంటుంది!





ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
హైదరాబాద్
9440850384



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.04.2026
www.mudranews.in | @mudranews



### రెండుసార్లు స్నానం



రోజుకు రెండుసార్లు స్నానం చేయండి. చెమట, దుర్వాసన తగ్గించడానికి ఉదయం-సాయంత్రం స్నానం చేయడం మంచిది.

## సంక్షిప్తంగా..

### ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీపట్నం మహేందర్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి పూలు వేసి, హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మల ఆరాధ్య గురువైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి చేయూత నందిస్తానని గతంలో కూడా రూ.10 లక్షల విరాళం అందించిన విషయాన్ని గుర్తు చేసి, మరోసారి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.50 లక్షల నిధులను అందిస్తానని ప్రకటించారు. అనంతరం విశ్వ బ్రాహ్మణ సంఘం నేతలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సమన్వయకర్త కరుణం పురుషోత్తం రావు, సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వాజిద్ , మాజీ ఎంపీటీసీ మధులత శ్రీనివాస్ చారి, సంఘ అధ్యక్షులు పాండురంగ చారి, కార్యదర్శి బాలు చారి, వినోద్ చారి, శ్రీనివాస చారి, రమేష్ చారి, లక్ష్మణ్ చారి తదితరులు ఆయనతో ఉన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తం



**ముద్ర, నారాయణ పేట :** కోతలు పూర్తయిన ధాన్యళ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు లో విక్ర యించుకొనే పరిస్తితులు నెలకొన్నాయని తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే జిల్లా పౌర సరఫరా, వ్యవసాయ శాఖల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులవుతున్న కొనుగోలు కేంద్రాలను నారాయణపేట జిల్లాలో పూర్తి స్థాయిలో నేటికి ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నేరుగా మిల్లర్లకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించుకుంటున్నారని అన్నారు. కలెక్టర్ స్థాయి అధికారి సమీక్ష చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి దాదాపు నెల రోజులు అవుతున్నా నేటికి జిల్లాలో పూర్తి స్థాయి లో కొనుగోలు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఎక్కడో ఒకటి, రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతుల మీద ఎలాంటి చిత్త శుద్ధి కనిపించడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేకపోతే రైతులకు మద్దతుగా ఉద్యమిస్తామన్నారు.

### అమ్మాయిలకు ఉచిత కరాటే శిక్షణ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్‌లో అమ్మాయిల కోసం ఉచిత కరాటే, తైక్వాండో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్టర్ స్వాతి రవి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 50 ఏళ్లు పైబడిన మహిళలు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 97030 47933, 99669 79309 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా వాసవి మాత జయంతి





**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారిక ప్రభుత్వ పండుగగా గుర్తించిన నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారి సీతారాం నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల కులదైవమైన వాసవి మాత జయంతికి అధికారిక గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో**

**ముద్ర, తాండూర్:** తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజా మాట్లాడుతూ తాండూర్ ప్రాంతానికి చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ చైర్మన్ కల్వ సుజాత విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి నిర్ణయించడంపై ఆర్యవైశ్య సమాజం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్,బిజెపి ఫ్లోర్ లీడర్ నాగారం మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్లు సుప్రీత, కిరణ్, జంటుపల్లి వెంకట్, మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా హేమంత కేశవ్ పాటిల్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా 9వ కలెక్టర్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హేమంత కేశవ్ పాటిల్ ఆదివారం అధికార బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బాధ్యతల నుంచి రిలీవ్ అవుతూ, నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా సేవలందిస్తున్న హేమంత కేశవ్ పాటిల్ ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, పాఠశాలల నాణ్యత, వైద్య సేవల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, సమర్థవంతమైన పరిష్కార మార్గాలు కనుగొనడం తన విధానమని, జిల్లా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## వంద పడకల ఆసుపత్రికి భూమిపూజ



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు,మల్లాపూర్‌లో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లాపూర్ డివిజన్ , పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సమీపంలోనే అందించాలనే లక్ష్యంతో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తరువాత అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.అలాగే, అత్యవసర చికిత్స, ప్రసూతి సేవలు, సాధారణ వైద్య సేవలు, పరీక్షా కేంద్రాలు వంటి విభాగాలతో ఈ ఆసుపత్రి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సునీత మాజీ కార్పొరేటర్లు, అధికారులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## స్వీయ గణన ప్రక్రియ ప్రారంభం

**మే 10 వరకు నమోదు అవకాశం**




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ ఆదివారం ప్రారంభించారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ డిజిటల్ విధానం ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, ఎస్పీలు స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చని, అవసరమైన వారికి గ్రామ, వార్డు స్థాయిలో సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు తమ వివరాలను నిజాయితీగా నమోదు చేయాలని సూచించారు. వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

### ఘనంగా పార్వతి బాలరాజు వివాహం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** స్థానిక శ్రీ జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం అరక్షిత బాలికల ఆశ్రమంలో పెరిగిన పార్వతి (16)కు రేవల్లి గ్రామానికి చెందిన బాలరాజుతో వివాహం జరిగినట్లు ఆశ్రమ నిర్వాహకులు ఆకారపు విశ్వనాథం పేర్కొన్నారు. చాపల శ్రీనివాసులు, సరిత దంపతులు దాతలుగా వ్యవహరించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, ఇన్‌చార్జ్ సిడిపిఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు నిజాముద్దీన్, పద్మ, చంద్రకళ, కావాలి శ్రీనివాసులు తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వీరి వివాహానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### పదేళ్లలో ఎమ్మెల్యే చేసింది శూన్యం

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేశ్**




**ముద్ర, కూకట్‌పల్లి:** పదేళ్ల లో కూకట్‌పల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసింది శూన్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చేస్తున్న 90 శాతం అభివృద్ధి ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. గతంలో ఐడీఎల్ చెరువు వద్ద 40 మంది చిరు వ్యాపారులను తొలగించినప్పుడు ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఇప్పుడు వారిపై చూపిస్తున్నది కేవలం రాజకీయం కోసమేనని ఎద్దేవా చేశారు. ఐడీఎల్ ల్యాండ్ అన్యాక్రాంతం కావడం వెనుక ఎవరి హస్తముందని, ఎమ్మెల్యేకు 'ఆనర్ హోమ్స్'లో ఇల్లు ఎలా వచ్చిందని ఆయన నిలదీశారు. అలాగే కేపీహెచ్‌బీలోని 'భువనవిజయం' బిల్డింగ్‌పై కూడా సవాల్ విసిరారు.కాంగ్రెస్ హయాంలోనే కూకట్‌పల్లి డిగ్రీ కాలేజీకి రూ.2.5 కోట్ల నిధులు తెచ్చామని, మూసాపేట ఫ్లైఓవర్ (రూ. 170 కోట్లు), జేఎన్‌టీయూ స్కైవాక్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వంద పడకల ఆసుపత్రిని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో గోపాల్ నగర్‌లో పార్కు నిర్మించలేని ఎమ్మెల్యే, ఇప్పుడు హైడ్రా ద్వారా 3,300 గజాల స్థలంలో పార్కు ఏర్పాటవుతుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. రైతు బజార్లు, ఫిష్ మార్కెట్లు, కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని, ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతామని బండి రమేశ్ హెచ్చరించారు. చివరగా ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదని, అధికారులను బెదిరించడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

### వివాహ శుభకార్యాలలో స్పీకర్, ఎమ్మెల్యేలు



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని పలు వివాహ, శుభకార్యాల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి పాల్గొన్న తాండూర్ శాసన సభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని జి. పి ఆర్. గార్డెన్స్ లో మిత్రు నాయక్ కోడలి వివాహం, వినాయక కన్వెన్షన్ లో బషీరాబాద్ మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి కూతురు, భవాని ఫంక్షన్ హాల్ లో రాంపూర్ సర్పంచ్ కుమారుని వివాహం, ఆర్యవైశ్యలో మారేపల్లి వాస్తవ్యులు రవీందర్ రెడ్డి కూతురు, రాయల్ ఫంక్షన్ హాల్ లో చంగోల్ వాస్తవ్యులు గోపాల్ రెడ్డి కుమారుని, సల్ల గార్డెన్ లో అశోక్ వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ముగిసిన పర్యావరణ సేవా వారోత్సవాలు




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపుతో, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ సేవా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. క్లబ్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి నేతృత్వంలో చివరి రోజు వాకింగ్ వండర్స్ సభ్యులతో కలిసి నిర్వహిం చిన ర్యాలీతో ముగింపు పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త, మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ ఇంధనం, వ్యర్థాల నుండి సంపద సృష్టి, నీటి సంరక్షణ, అభయారణ్యాల పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం వంటి అంశాలపై కరపత్రాలు రూపొందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాఠశాలలు, బస్టాండ్, మార్కెట్ యార్డు వంటి ప్రదేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చామని వివరించారు. మరో సమన్వయకర్త హకీమ్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సభ్యుడు కనీసం పది మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని క్లబ్ సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ రాధాకృష్ణ, కాబినెట్ సభ్యుడు హకీమ్ విశ్వప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు రాచూరి వెంకటరాజు, వాస రాఘవేందర్, లక్ష్మీనరసింహ గౌడ్, రామకృష్ణారెడ్డి, నెల్లి శ్రీనివాస్ రెడ్డి, కరాటే విద్యార్థులు, వాకింగ్ వండర్స్ సభ్యులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్/నారాయణపేట:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని ఏప్రిల్ 27 నుంచి మే 23 వరకు నిర్వహించనున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్. కృష్ణ నారాయణపేట కార్యక్రమ ఇన్చార్జి శాస్త్రవేత్త డాక్టర్ టి. రాజేశ్వర్ రెడ్డి వేర్వేరుగా వివరాలు అందించారు. దక్షిణ తెలంగాణలోని 10 జిల్లాల్లో అమలు చేస్తూ, ప్రతి జిల్లాలో 5 మండలాలు చొప్పున మొత్తం 400 గ్రామాల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. ఇందులో శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొంటారు. రైతులు అవసరానికి మించి యూరియా వాడకుండా సమతూల్య ఎరువుల వినియోగంపై అవగాహన పొందుతారు. అలాగే పెస్టిసైడ్స్, ఫంగిసైడ్స్ వంటి వ్యవసాయ రసాయనాలను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించే విధానంపై మార్గదర్శనం ఇవ్వబడుతుంది. ఒకే పంటపై ఆధారపడకుండా పంట వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం స్థిరంగా ఉండేలా సూచనలు అందిస్తారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా మెరుగైన ధరలు పొందేలా అవగాహన కల్పిస్తారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి నీటి సంరక్షణ పద్ధతులపై రైతులకు మార్గదర్శనం అందించడంతో పాటు నీటిని సమర్థవంతంగా వినియోగించే విధానాలు నేర్పిస్తారు. రసాయనాల వినియోగం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లడం ద్వారా నేల ఆరోగ్యం, పంటల నాణ్యత మెరుగుపడేలా సూచనలు అందిస్తారు. ఈ కార్యక్రమంలో రైతులు శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడి తమ సమస్యలకు వెంటనే పరిష్కారాలు తెలుసుకునే అవకాశం కల్పించబడుతుంది. అందువల్ల రైతులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

### 27న పద్మావతి శ్రీనివాస కళ్యాణం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం మండలంలోని బిజినపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించను న్న ధార్మిక కార్యక్రమాలకు భక్తులకు ఆలయ నిర్వాహ కులు ప్రత్యేక ఆహ్వానం పలికారు. బత్తుల అమిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీ పద్మావతి సమేత శ్రీనివాసుల పరిణయోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రతిరోజూ నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిత్య అన్నదాన సత్ర కమిటీ అధ్యక్షుడు వాస ఈశ్వరయ్య తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అనంత నరసింహారెడ్డి, మేనేజింగ్ ట్రస్ట్ సభ్యుడు సందడి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

### ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ ఉద్రిక్తత

**ముద్ర, కాప్రా:** కాప్రా డివిజన్ పరిధిలో ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ నాయకుడు ఇంద్రయ్య కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడంతో స్పందించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత నాయకుడు బాబురావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, ఇంద్రయ్య చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు. ఉప్పల్ నియోజకవర్గం లో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగానే ప్రత్యేక నిధులతో పనులు జరుగుతున్నాయని దీని చూసి ఓర్వలేక పరమేశ్వర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు ఈ సందర్భంగా కాప్రాలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ పరిణామాలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని ఇరుపక్షాలను శాంతింపజేశారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.04.2026
www.mudranews.in | @mudranews



### లైట్ ఫుడ్ తినండి

మసాలా, ఆయిలీ ఫుడ్ తగ్గించి, పండ్లు మరియు కూలింగ్ ఫుడ్స్ తీసుకోండి.



# స్వీయ గణనలో భాగస్వాములు కావాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**




**ముద్ర, కరీంనగర్:** జన గణన 2027 లో భాగంగా జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను స్వయంగా నమోదు( స్వీయ గణన) చేసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో చేపడుతున్న జన గణనలో భాగంగా స్వీయ గణన కార్యక్రమంపై ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ గణనలో ప్రతి కుటుంబం తమ గృహానికి సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్ లైన్ ద్వారా ఫోన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇది సులభమైన, సురక్షితమైన, పారదర్శకమైన విధానమని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వీయ గణన ఆదివారం నుంచి మే 10 వరకు పదిహేను రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. జనాభా గణనలో గృహాల, నివాసయోగ్య స్థితి, వసతులు, మతం, షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, కుటుంబ యజమాని పేరు, తాగునీటి వసతి, గృహ వినియోగం, ఇంధనం వంటి వివరాలతో కూడిన 34 రకాల ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ సమాచారం దేశ ప్రగతి .అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. se.censes.giv.in ఈ పోర్టల్ ద్వారా ప్రజల తమ మొబైల్ నెంబర్ తో లాగిన్ అయి గృహాన్ని జియో ట్యాగ్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ జనరేట్ అవుతుందన్నారు.

**స్వీయ గణనకు కలెక్టర్ శ్రీకారం..**

జనాభా గణనలో భాగంగా జిల్లాలో కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదివారం స్వీయ గణనకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ స్వయంగా తన వివరాల నమోదు చేసుకొని స్వీయ గణన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన ఒక జాతీయ కీలక కార్యక్రమం అని పేర్కొన్నారు., కలెక్టర్ తో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి రాం దత్తారెడ్డి కూడా తమ వివరాలు నమోదు చేసుకున్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ లది ఫెవికాల్ బంధం

**- కాంగ్రెస్ కార్పోరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ, బీఆర్ఎస్ ల మధ్య ఫెవికాల్ బంధం కొనసాగుతోందని కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్పొరేషన్ లో ఇటీవల జరిగిన మేయర్, కో-ఆప్షన్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందం బయటపడిందన్నారు. ఈ ఎన్నికలు రెండు పార్టీల మధ్య ఉన్న అంతర్గత అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. మేయర్ ఎన్నికల్లో బీజేపీకి సరైన కోరం లేకపోయినా, బీఆర్ఎస్ మద్దతుతో అది సాధ్యమైందని విమర్శించారు. కో-ఆప్షన్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా రెండు పార్టీల మధ్య ఉన్న అనుబంధం స్పష్టమైందన్నారు.

## ఘనంగా వాసవి మాత జయంతి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాలలో..**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ ఆలయం నుంచి వాసవి మాత ఆలయానికి అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని అమ్మ వారి పల్లకి మోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ గోలి శ్రీనివాస్, వైశ్య సంఘం అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి బోడ్ల జగదీష్, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మెన్ రాజేందర్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్, అరవింద్, సంతోష్, సునీల్, వైశ్య సంఘం సభ్యులు, వాసవి మాత భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా భవేశ్ మిశ్రా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రానికి చేరుకున్న నూతన కలెక్టర్‌కు.. పూర్వపు కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా అధికారులు జీవరత్నం, డా. రాజేందర్, శ్రీనివాస్, నరసింహ రెడ్డి, దయానంద్, భోజన్న, సుధాకర్, విజయలక్ష్మి , రమణ, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**బాసర అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు..**

నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన భవేశ్ మిశ్రా, ఆయన సతీమణి యిలా త్రిపాఠి ఆదివారం బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ దంపతులకు అధికారులు, అర్చకులు స్వాగతం పలి కారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

**- దంపు యార్డు సమస్యపై కేంద్ర మంత్రికి భాధ్యత లేదా**
**- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ లో ఎల్లప్పుడూ బీజేపీ, బీఆర్ఎస్ లు సహకరించుకుంటాయని తెలిపారు. ఈ విషయం మున్సిపల్ కార్పోరేషన్ కో ఆప్షన్ ఎన్నికతో మరోసారి రుజువైందని చెప్పారు. దంపు యార్డు సమస్య పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. యేడాది క్రితం బీజేపీ నాయకులు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను తీసుకువచ్చి స్మార్ట్ సిటీ పనులకు అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అన్ని పనులు జరిగిపోయినట్టు ప్రజలకు భ్రమలు కల్పించారని ఆరోపించారు. ఇప్పుడేమో భాధ్యత లేనట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ఎదుల జంతువుల కళేబరాలు వేస్తామని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందరి క్షేమం కోరుకునేవారని చెప్పారు. దంపు యార్డు విషయంలో కూడా బీజేపీ, బీఆర్ ఎస్ నాయకులు ఒక్కటై హుజురాబాద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా అనవసరంగా రకరకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్నారని నమండిపడ్డారు. బండి సంజయ్ కేంద్రం ద్వారా ఏవిధమైన సహకారం లభిస్తుందో చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చి త్తశుద్ధితో ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కార్పోరేటర్లు వరాల నర్సిం గం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, నాయకులు దండి రవీందర్, ఇట్టెపు వేణు, మ్యాకల నర్సయ్య, జీడి రమేష్, వంగల విద్యాసాగర్, సతీష్, హనీఫ్, అజయ్, ఖలీల్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా కేంద్రంలోని బాగులవాడ శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. పదో తరగతి పూర్తి చేసుకున్న 32 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 120 మంది వి ద్యార్థులు, 14 మంది ఆచార్యులు ఒక చోట చేరి పాత జ్ఞాపకాలు, అనుభవాలను పంచుకున్నారు. ప్రధానాచార్యులు రావుల సూర్యనారాయణ, ఆచార్యులు రామానుజాచార్యులు, ప్రసాద్ రావు, హరిబాబు, నయన, గోపాలాచార్యులు, సత్యనారాయణ, రాజేందర్, గంగాధర్, రాములు, నారాయణ, బాలయ్య, చంద్రశేఖర్, ముత్యంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్‌తో సమయం ఆదా



**మహాదేవపూర్, ముద్ర:** సెల్ఫ్ ఎన్యూమరేషన్‌తో సమయం ఆదా అవుతుందని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుండి జనగణన డిజిటల్ నమోదు కార్య క్రమం ప్రారంభమైన సందర్భంగా కలెక్టర్ తన నివాసంలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో స్వయంగా తన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం నుండి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. సీపీఓ జవహర్ తదితరులు పాల్గొన్నారు.


## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ముద్ర, కోరుట్ల:** పట్టణంలోని ఆర్యవైశ్యులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పడిగెల శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నాయకులు జు వ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్ పర్సన్ తిరు మల వసంత గంగాధర్, శ్రీ సాయి దత్త పీఠం అమెరికా వ్యవస్థాపకుడు శంకరమంచి రఘుశర్మ, కొడవటి గంటి మహాదేవ శర్మ హాజరయ్యారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు నీలి కాశీ నాథ్, కోటగిరి ప్రసాద్, బట్టు హరికృష్ణ, మోటూరి రాజు, వాసవి దేవాలయ కమిటీ చైర్మన్ పడిగెల పవన్ కుమార్, సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు మంచాల జగన్, మహిళా సంఘ ప్రతినిధులు నీలి అనురాధ, కొత్త శోభ, భూస మాధురి, యువజన సంఘ ప్రతినిధులు పల్లెర్ల రాకేష్, రంజిత్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండలం లచ్చక్కపేటలో రాజమల్లు-లావణ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్లును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపి, చీర కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లచ్చక్కపేట సర్పంచ్ చెట్లపల్లి రమ భాస్కర్, నగునూరు సర్పంచ్ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణారావు, తోడేటి శేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆకుల తిరుపతి, తోట మల్లయ్య, అనుపుర రాజనర్సు, అత్తినేని శ్రావణ్ కుమార్, ఎవ్వం గంగాధర్, దెబ్బడ శ్రీధర్, జంగిలి మహేష్ , డాక్టర్ రమేష్, బొమ్మన తిరుపతి, జంగిలీ మహేష్పా ల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తాం



**ముద్ర, కోరుట్ల:** ప్రజా ప్రభుత్వంలో పేదోళ్ల సొంతింటి కల నెరవేరుస్తామని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయ కులు జువ్వాడి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం కోరుట్ల మండలం లోని గుమ్లాపూర్ గ్రామంలో మంద రంజిత్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో ఆయన పాల్గొన్నారు. మంద రంజిత్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంతం రాజం, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డ వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజవర్గ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ అరుణ్ రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంగని శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



**బోథ్, ముద్ర:** బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ రమేష్ సూచించారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బడీడు పిల్లలందరిని తప్పకుండా బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత భోజనం, పుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫారం, ఆట వస్తువులు తదితర సౌకర్యాలు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల బృందంతో విద్యా బోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ పంద్రం సుగుణ శంకర్, పర్యవేక్షకులు రాజేశ్వర్, ప్రధానోపాధ్యా యులు ఆత్రం శంకర్, శేఖర్, ఉపాధ్యా యులు సాయి రెడ్డి, ఇందల్ సింగ్, మోహన్ సింగ్. మారుతి, లక్ష్మణ్, నాగోరావు, రాంచందర్, లాఖాన్ సింగ్, బలిరాం తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ శ్రేయస్సు కోరేదే సనాతన ధర్మం



**ముద్ర, కోరుట్ల:** విశ్వంలోని సర్వ జీవుల శ్రేయస్సు కోరేదే మన సనాతన ధర్మమని శృంగేరి శారదా పీఠ ఆస్థాన పౌరాణికులు, బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. పట్టణంలోని వాసవి కన్యకా పర మేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పాలెపు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి మాట్లాడారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పడిగేల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బట్టు హరికృష్ణ, మోటూరి రాజు, కోటగిరి ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పవన్, యువ నాయకుడు పల్లెర్ల రాకేష్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



డియోడరెంట్ లేదా టాల్కమ్ వాడండి
చెమట వాసన తగ్గించడానికి మంచి క్వాలిటీ డియోడరెంట్ లేదా పౌడర్ ఉపయోగించండి.


## అన్ని శాఖల సమన్వయం అవసరం

- డ్రగ్స్ నిర్మూలనకు వారం రోజులు అవగాహన కార్యక్రమాలు
- సూర్యాపేట ఎస్పీ నరసింహ




**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 5వ అంశం పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన పై జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుండి వారం రోజుల పాటు ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. దీని కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పని చేస్తాం అన్నారు. అన్ని గ్రామాలకు పోలీసు సిబ్బంది వెళ్లి డ్రగ్స్ వల్ల జరుగుతున్న అనర్థాల గురించి, పిల్లల, యువత భవిష్యత్తుపై దుష్ప్రభావం గురించి వివరించడం జరుగుతుందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు, మత్తుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారు. మన పిల్లలు మన సమాజాన్ని మాదకద్రవ్యాల బారినుండి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అని తెలిపినారు. గంజాయి సరఫరా, వినియోగం పై నిఘా ఉంచడం జరిగినది గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వారిపై, వినియోగించే వారిపై పోలీసు నిఘా ఉంచాం, వీరికి కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తాము అన్నారు. అవగాహన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని మాదకద్రవ్యాల రహిత ఆరోగ్యకర సమాజ నిర్మాణం లో భాగస్వామ్యం కావాలని కోరారు.




## నేటి నుంచి స్వీయ జనగణన

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జిల్లాలో జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన ప్రక్రియకు నేటి నుండి అవకాశం కల్పించిన్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబ వివరాలను స్వయంగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జనగణన–2027లో భాగంగా ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న స్వీయ గణనపై ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీయ గణన ప్రక్రియ నేటి నుండి 10 మే 2026 వరకు అందుబాటులో ఉంటుందని, ఈ కాలంలో ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, సౌకర్యాలు మొదలైన అంశాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ఈ సారి జనగణనలో మొదటిసారిగా స్వీయ గణనను ప్రవేశ పెట్టడం జరిగిందని, ఇది దేశాన్ని డిజిటల్ దిశగా తీసుకెళ్లే ముఖ్యమైన అడుగు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ, ఎస్ ఓ ఇస్లావత్ ఓబులాలు, ఎస్ ఓ వి రామారావు, ఎం రాజేష్, దున్న శ్యామ్ ప్రింట్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

- సీపీఐ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ముద్ర, ఖమ్మం :** ఎండలు మండుతున్న సమయంలో సిపిఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని త్రాగునీరు అందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని ప్రజలు అల్లాడుతున్నారన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహా రావు ఆధ్వర్యంలో ఖమ్మం వన్టేన్ పరిధి లోని –అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య –అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి కొరత తీర్చేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని హేమంతరావు సూచించారు. సేవాభావంతో సిపిఐ వన్టేన్ నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. రానున్న కాలంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాసేవలో ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. – అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ నేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ. యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, సిపిఐ నాయకులు మాదుగుల నాగేశ్వరరావు, యాకూబ్, చందు, సిద్ది శ్రీను, వెంకీ, ఉమా, ముత్తయ్య, తాళ్లూరి శ్రీను, సుశీల, నాగమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరిలో శ్రీ వాసవి మాత హోమ వైభవం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం వాసవి జయంతి సందర్భంగా శ్రీ వాసవి మాత సన్నిధిలో పవిత్ర హోమం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఆగమ విధానాల ప్రకారం హోమం నిర్వహించి, శాంతి మరియు ఐశ్వర్యం కలగాలని సంకల్పించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం హారతి ఇచ్చి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్యకైంకర్యాలు జరిగాయి. అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సుమారు



5000 మందికి పైగా భక్తులు అన్న ప్రసాద వితరణలో భాగంగా ఆదివారం నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆదిమధ్యాంతర హితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య



శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్ర దీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

# జన గణన సమగ్రంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు

**ముద్ర, బీబీనగర్ :** జన గణన 2027 ను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. ఆదివారం బీబీనగర్ లోని ఎంపీడీవో కార్యాలయంలో సూపర్వైజర్స్ ఎన్యుమరేటర్లకు జనగణన– 2027 ఫేజ్–2 శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, జనగణన శిక్షణ తరగతులు పూర్తి అవగాహన కలిగి గృహాల గణనలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేసే విధానాన్ని సమగ్రంగా చేపట్టాలన్నారు.




ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణను సమగ్రంగా, నాణ్యంగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ , మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



## సమస్యను సత్వరమే పరిష్కరించాలి

- ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఎంపీ వద్దిరాజు టెలికాన్ఫరెన్స్

**ముద్ర, ఖమ్మం:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రంగా వేదిస్తున్న పెట్రోల్ డీజిల్ కొరతలపై బీఆర్ఎస్ ఎంపీ, పెట్రోల్, సహజ వాయు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పందించారు. ఆయా కంపెనీల సరఫరాదారులు, ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి పెట్రోల్ డీజిల్ కొరతలను తక్షణమే తీర్చాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్రను పలువురు పెట్రోల్ బంక్ ల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పెట్రోల్, డీజిల్ సరఫరాలో జరుగుతున్న జాప్యం, బంకుల్లో ఏర్పడుతున్న కొరత గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఆయన అక్కడి నుంచే ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం కల్లా సమస్యను అధిగామిస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని కంపెనీల ప్రతినిధులు హామీ ఇచ్చారు.




## యోగా జీవన విధానం

- చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవి కుమార్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** యోగా కేవలం కార్యక్రమం కాదని జీవన విధానమని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవి కుమార్ అన్నారు. '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'హ్యాపీ సండే–యోగా' కార్యక్రమాన్ని భువనగిరి కొండ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "యోగాను కేవలం ఆదివారం కార్యక్రమానికి పరిమితం చేయొద్దని ప్రతిరోజూ ఉదయం 20 నిమిషాలు ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచి ఒత్తిడిని తగ్గించి రోజంతా ఉత్సాహంగా ఉంచుతుందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే యోగా నేర్పితే వారి ఏకాగ్రత, ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పి. మంజుల, స్థానిక క్రీడాకారులు సీనియర్ సిటిజెన్స్ వాకర్స్ పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా వాసవి మాతా జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో వాసవి మాతా జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా యువజన, క్రీడాల అధికారి ధనంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాల అభ్యర్థన మేరకు, వాసవీ మాత జయంతిని (వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి) రాష్ట్ర పండుగగా గుర్తించి ఈ నిర్ణయంతో 26 ఏప్రిల్ 2026న,తెలంగాణవ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, ఆర్యవైశ్య సత్రాలలో ప్రభుత్వ లాంఛనాలతో వేడుకలు జరగుతున్నాయన్నారు.జిల్లా యువజన, క్రీడాల అధికారి శ్రీ కే ధనంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా 'వైశాఖ శుక్ల పక్ష దశమి' రోజున వాసవీ మాత జయంతి అని దీనిలో భాగంగా ఈ సంవత్సరం వాసవీ మాత పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తునామని వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి సంఘం అధ్యక్షులు మహేష్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ కే.



చంద్రశేఖర్, వాసవి సంఘం రీజినల్ సెక్రటరీ ఏ. రమేష్, వాసవి సంఘం సెక్రటరీ జె.హనుమంత రావు, వాసవి మెంబర్లు మనోహర్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సోమన్న, రాజేందర్, కార్యాలయ సిబ్బంది మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మెగా జాబ్ మేళాకు శ్రీకారం

- ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మే 8, 9, 10 తేదీల్లో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, భువనగిరి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయి. సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొని 3500కి పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజనీరింగ్ ఇతర టెక్నికల్ వారు అర్హులన్నారు. 12,000 నుండి 40,000 వరకు (అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా వేతనాలు నిర్ణయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖ బాబురావు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఎయిర్ సర్క్యులేషన్ ఉండే ప్రదేశాల్లో ఉండండి**

వెంటిలేషన్ ఉన్న చోట ఉండటం వల్ల చెమట తక్కువగా వస్తుంది.



# కో-ఆప్షన్‌పై కాంగ్రెస్ ఫోకస్

- నేడు మెదక్‌లో ఎన్నిక
- ఆ నలుగురి ఎన్నిక లాంఛనమే

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మున్సిపల్ పీఠాన్ని 'హస్త'గతం చేసుకున్న అధికార కాంగ్రెస్ కోఆప్షన్ పదవులపై దృష్టి సారించింది. మెదక్‌లో 32 వార్డులు ఉండగా, నాలుగు కోఆప్షన్ పదవులకు ఎన్నిక జరగనుంది. నోటిఫికేషన్ విడుదల చేసి అధికారులు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 12 మంది నామినేషన్లు వేశారు. వీరిలో కాంగ్రెస్ నుంచి రాగి వనజ, సయ్యద్ తాహేర్, కొర్వి రాములు, గౌడిచెర్ల అనూష ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి విజయలక్ష్మి, నౌసిన్ ఫాతిమా, జయరాజ్, మహమ్మద్ ఫాజిల్ దాఖలు చేయగా, మరో నలుగురు సైతం నామినేషన్లు వేశారు. నాలుగుకంటే ఎక్కువ నామినేషన్లు రావడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈనెల 27న ఎన్నిక నిర్వహించనున్నారు.




**గెలుపుకోసం కాంగ్రెస్ వ్యూహం**

కోఆప్షన్ పదవులు గెలుపొందేందుకు అధికార కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్‌ను సంఖ్యాపరంగా బలహీనపరుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు చక్రం తిప్పుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లపై దృష్టి సారించారు. ఒక్కొక్కరిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. కాంగ్రెస్ బలం 15 నుండి 21కి పెరగగా, బీఆర్ఎస్ బలం 15 నుండి 9కి తగ్గింది. ఎన్నికలు జరిగిన రెండు నెలల్లోనే బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన 1, 13, 16, 22, 23, 27 వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ నుంచి 15 మంది గెలుపొందగా, ఆరుగురు పార్టీని వీడారు. రాబోయే రోజుల్లో ఇంకా కొంత మంది పార్టీని వీడనున్నట్లు సమాచారం. దీంతో గులాబీ పార్టీలో ఆందోళన నెలకొంది.

**నేడు కో-ఆప్షన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం: కమిషనర్**

మెదక్ పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నాలుగు కోఆప్షన్ సభ్యుల ఎన్నికలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పాల్గొంటారని పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.



## చిన్నారి కడియాలపై కన్నేసిన దుండగుడు అరెస్ట్

- క్యూఆర్టీ అప్రమత్తతతో పట్టుబడిన దొంగ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఓ తల్లి షాపులో కొనుగోళ్లు చేస్తున్న సమయంలో, ఆమెతో ఉన్న చిన్నారిని ఓ దుండగుడు పక్కకు తీసుకెళ్లి, చిన్నారి కాళ్లలో ఉన్న వెండి కడియాలను అపహరించి తన లోదుస్తుల్లో దాచుకున్నాడు. విధుల్లో అప్రమత్తంగా ఉన్న క్యూ ఆర్ టీ సిబ్బంది గమనించి వెంటనే అనుమానితుడిని అదుపులోకి తీసుకోగా, రెండు వెండి కడియాలు అతని వద్ద లభించాయి. పోలీసులు వెంటనే ఆ వెండి కడియాలను చిన్నారి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పాపన్నపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## కాలిపోయిన స్ప్రింక్లర్ పైపులు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

కరెంట్ తీగల నుంచి పడిన మెరుపులతో రైతుకు చెందిన స్ప్రింక్లర్ పైపులు కాలిపోయిన సంఘటన చిన్నకోడూరు మండలం చందులాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు చిగురు పద్మ తెలిపిన వివరాల ప్రకారం, తమ వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగల నుంచి ఒక్కసారిగా మెరుపులు పడి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న రెండు సెట్ల స్ప్రింక్లర్ పైపులు పూర్తిగా కాలిపోయి రూ. 80 వేల నష్టం జరిగిందని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని, అక్కడే మేకల పాక ఉందని తొలగించాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. వారు చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలిన పైపులకు విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం అందించాలని కోరారు.

## గడపగడపకు "జానో జాగో"

- జనాల్లోనే శక్తి, జనాలతోనే మార్పు
- సంఘం అధినాయకత్వం పిలుపు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

ముస్లింల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధనే లక్ష్యంగా "జానో జాగో" సంఘాన్ని ప్రతి గడపగడపకు తీసుకెళ్లాలని సంఘం అధినాయకత్వం పిలుపునిచ్చింది. జనాల్లోనే నిజమైన శక్తి ఉందని, ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను అర్థం చేసుకుంటేనే స్థిరమైన మార్పు సాధ్యమని నేతలు స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఈ దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి జాతీయ అధ్యక్షుడు సయ్యద్ నిసార్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా తన్జిలుర్ రహ్మాన్ నోమాని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముస్లిం సమాజంలో రాజకీయ చైతన్యం పెంపొందించడం, ఆర్థికంగా బలోపేతం చేయడం, సామాజికంగా ముందుకు తీసుకెళ్లడం "జానో జాగో" సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ముస్లిం కుటుంబంతో నేరుగా అనుసంధానం పెంచి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. సంఘం కార్యకర్తలు గడపగడపకు వెళ్లి ప్రజల నమ్మకం గెలుచుకోవాలని, సేవా భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్యే ఉండటం ద్వారా మాత్రమే నిజమైన నాయకత్వం వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ రహీం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ యూసుఫ్, కేంద్ర కమిటీ సభ్యుడు మెహరాజ్, గ్యాదరింగ్ కమిటీ కోకన్వీనర్ సుభాన్ అలీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ గౌస్ పాషాను "జానో జాగో" సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని సంఘం అధినాయకత్వం అందజేసింది. సంఘం బలోపేతానికి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపాలని నేతలు స్పష్టం చేశారు. ఇదే "జానో జాగో" సందేశమని పేర్కొన్నారు.



# ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత అని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సూచించడంతో వాసవి మాత జయంతి ఉత్సవాలను మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డీపీఆర్ఓ రామచంద్ర రాజు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు చంద్రపాల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బుక్క అశోక్, కోశాధికారి మరుమల్ల అశోక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాగి వనజ, కౌన్సిలర్ శివరామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ రాయకంటి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మ్యాడం బాలకృష్ణ, రాగి అశోక్, పట్టణ కార్యదర్శి బచ్చు పార్థివనాథ్, ఉప్పల శ్రీకాంత్, కోవురి శ్రీనివాస్, షిర్నా రాజేశ్వరి, పుట్కురి వీరేశం, కొండా శ్రీనివాస్, పురం వెంకట నారాయణ, కొమ్మ వెంకటేష్, బజ్జూరి బిక్షపతి, మురళి, పొగాకు రామకృష్ణ, సుష్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



**జిల్లా పోలీస్ కార్యాలయంలో వాసవి మాత జయంతి**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని వాసవి మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె బోధనలు, అహింసా సిద్ధాంతం, సమానత్వ భావన, సామరస్య సందేశాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐలు సుభాష్, మహిపాల్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**వాసవి మాతకు నవరసాలతో అభిషేకం**

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత 19వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఉదయం ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయం నుండి నవరసాలతో, తొమ్మిది రంగుల చీరలు ధరించి శ్రీ వాసవి మాత ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం అమ్మవారికి నవరసాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే వాసవి మాతకు 108 నామాలతో పగడాలతో నామార్చన, బాదం పలుకులతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వాసవి మాతకు ఒడిబియ్యం సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాగి వనజ, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ శివరామకృష్ణ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## నేటి నుంచి మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారం ఈనెల 27వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా సంక్షేమ శాఖ, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పోలీస్ వివిధ సంక్షేమ శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. 27న శిశు సంరక్షణ సంస్థలలో అనంతర సంరక్షణ, పోలీస్ శాఖ/ఈగిల్ టీమ్ ద్వారా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ ఉంటుందన్నారు

## మెదక్ వాసికి అఖిల భారత స్థాయి పదవి

- టాక్స్ ప్రాక్టీషనర్స్ సమాఖ్యలో కీలక బాధ్యతలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది రామరాజు విఠల్‌కు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అఖిల భారత స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అఖిల భారత పన్ను ప్రాక్టీషనర్ల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఆయన నియమితులయ్యారు. బెంగళూరులో నిర్వహించిన దక్షిణ భారత విభాగ సభ్యుల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మెదక్ పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన విఠల్, మెదక్ తొలి, రెండవ ఎమ్మెల్యే, ప్రముఖ న్యాయవాది దివంగత ఆర్. వెంకటేశ్వరరావు మనుమడు (శ్రీనివాస్ గారి తనయుడు). తన తాత అడుగుజాడల్లో న్యాయవాద వృత్తిలో రాణిస్తూ, ప్రస్తుతం జాతీయ స్థాయి పన్ను ప్రాక్టీషనర్ల సమాఖ్యలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల మెదక్ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# హ్యాకథాన్‌లో సత్తా చాటిన సిద్దిపేట పాఠశాలలు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

ముస్కాన్ డ్రీమ్స్ క్రియేటివ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, వెల్స్ ఫార్గో సహకారంతో హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అంతర్ జిల్లా ఏఐ సాక్ష్యం హ్యాకథాన్ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంటకు, బెస్ట్ క్రిటికల్ థింకింగ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకోడూరుకు, బెస్ట్ ఎఫెక్టివ్ కమ్యూనికేటర్‌గా జిల్లా పరిషత్ పాఠశాల చందులాపూర్‌కు అవార్డులు లభించాయని జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 120 పాఠశాలలలో 10 ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయని, ఈ పది పాఠశాలలు రాష్ట్రస్థాయి హ్యాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్నాయని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకోడూరు విద్యార్థులు రైతులు పొలాలకు నీటిని పంపిణీ చేసే విధానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందులాపూర్ విద్యార్థులు ఫేక్ డీప్ వీడియోలు మరియు చిత్రాల వల్ల కలిగే నష్టాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట విద్యార్థులు కూరగాయలను రైతులు సులభంగా సేకరించే విధానంపై తమ ఆవిష్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతి పాఠశాల విద్యార్థులు తమ నూతన ఆవిష్కరణలు, క్రియేటివిటీ, ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్, క్రిటికల్ థింకింగ్, ఊహాత్మక నైపుణ్యాల ద్వారా చక్కగా ప్రజెంటేషన్ చేశారని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించిన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ముస్కాన్ డ్రీమ్స్ క్రియేటివ్ ఫౌండేషన్‌కు, సహకారం అందించిన వెల్స్ ఫార్గోకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాజెక్ట్ లీడ్ అభిజిత్ భిస్తి, ప్రాజెక్ట్ మేనేజర్ పావని, సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ అసోసియేట్స్ శ్రీనివాస చారి, నాగరాజు, విజయ్, హేమలత పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కాఫీ, టీ తగ్గించండి**

కాఫీన్ ఉన్న డ్రింక్స్ చెమటను పెంచుతాయి కాబట్టి తగ్గించడం మంచిది




ప్రతీక్‌జైన్


ప్రియాంక

# చర్చనీయాంశంగా కలెక్టర్ బదిలీ

- **ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినందుకా?**
- **కేవలం 41 రోజులకే బదిలీ**
- **నూతన కలెక్టర్ గా సీహెచ్ ప్రియాంక**

ముద్ర, నారాయణపేట:

పట్టుమని రెండు నెలలు కూడా కాలేదు... ఏమైందో తెలియదు గానీ ఉన్నట్టుండి నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బదిలీ అయ్యారు. ఈయనను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో 2018 బ్యాచ్ కు చెందిన సీహెచ్ ప్రియాంకను నూతన కలెక్టర్ గా నియమించారు. రాష్ట్ర పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ గా పనిచేసిన ప్రియాంక, జనరల్ అడ్మినిస్ట్రేషన్లో కూడా పనిచేశారు. ఇదిలాఉండగా, నారాయణపేట జిల్లా కలెక్టర్ గా పనిచేసిన ప్రతీక్ జైన్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి అయ్యేవరకు ఇక్కడే ఉంటారని జిల్లా ప్రజలు, అధికారులు భావించారు. జిల్లాలో ఉన్న ఇసుక రీచ్ ల సంఖ్యను పెంచి, ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాలో వాహనాలు పట్టు పడితే తన అనుమతి లేనిదే వదిలేది లేదని తేల్చి చెప్పారు. మట్టి రవాణా కూడా ఆన్లైన్లోనే జరగాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ నును గాడిలోకి తెచ్చారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినందుకే కలెక్టర్ బదిలీకి కారణమా లేక ఇష్టపూర్వకంగా సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా గతంలో నారాయణపేట జిల్లా కలెక్టర్లుగా రోనాల్డ్ రోస్, వెంకట్రావు, దాసరి హరిచందన, కోయ శ్రీహర్ష, సిక్త పట్నాయక్, ప్రతీక్ జైన్ లు పనిచేశారు. అత్యధిక రోజులు దాసరి హరిచందన నారాయణపేట జిల్లా కలెక్టర్ గా పని చేయగా అత్యల్పంగా ప్రతీక్ జైన్ (41 రోజులు) పనిచేయడం విశేషం.




# కరాటే కాటస్ తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు

ముద్ర, కుషాయిగూడ:

హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం కుషాయిగూడ, చర్లపల్లి, నాగారం ప్రాంతాలకు చెందిన ఛాంపియన్ షోటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కరాటే కిక్కుతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించారు. ఈ పోటీలలో సుమారు 2 వేల మంది కరాటే విద్యార్థులతో 20 నిమిషాల వ్యవధిలో 40 సార్లు కరాటే కాటస్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సాధించారని చాంపియన్ షోటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ కరాటే కోచ్ బుడిగే రవికుమార్ గౌడ్ తెలిపారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ చోటు సాధించడం ఒక కల అని, అది ఈరోజుతో నెరవేర్చుకోవడం, అలాగే తన కరాటే విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సాధించడం గర్వకారణం అని అన్నారు. ఈ సందర్భంగా కరాటే విద్యార్థులకు టీ షర్ట్ అందజేశారు.

# మరో మైలురాయికి చేరువలో బీఆర్ఎస్

- **బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కోలేటి దామోదర్**

ముద్ర, హైదరాబాద్:-



తెలంగాణ రాష్ట్ర సమితి గా ప్రస్థానం ప్రారంభించి, భారత రాష్ట్ర సమితిగా మారిన గులాబీ పార్టీ ఎన్నో మలుపులు తిరిగి, ఎన్నో పోరాటాలు చేసి, నేడు మరో చారిత్రక మైలురాయిని చేరుకోబోతోందని బీఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి కోలేటి దామోదర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2001 ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) స్థాపించిన టీఆర్ఎస్ పార్టీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధనే తన మొదటి లక్ష్యంగా పెట్టుకుని జనాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం టీఆర్ఎస్ చేసిన పోరాటం ఏపీ రాజకీయాల్లో తొలకరి గాలిలా మారిందని. తొలుత తక్కువ మందితో ప్రారంభమైన ఈ ఉద్యమం, క్రమంగా లక్షలాది మంది ప్రజల మద్దతుతో పెద్ద తుఫానుగా మారిన సంగతిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉద్యమం మధ్యలో వచ్చిన అవమానాలు, విమర్శలు, రాజకీయ కుట్రలన్నింటిని అధిగమిస్తూ టీఆర్ఎస్ గళాన్ని మరింత బలంగా ప్రజల్లోకి చొప్పించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. కేసీఆర్ తిరుగులేని సంకల్పం, నిరంతర పోరాటం ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రోజు నుంచి తెలంగాణ ప్రజల గుండెల్లో టీఆర్ఎస్ పార్టీకి ప్రత్యేక స్థానం లభించిందని దామోదర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలన వల్ల తిరోగమన దిశలో పయనిస్తున్న తెలంగాణను కాపాడుకునేందుకు హైదరాబాద్ లో జరగనున్న పార్టీ మహాసభలో కేసీఆర్ చేసే దిశా నిర్దేశం కోసం పార్టీ కేడర్ ఆత్రుంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో చిన్నాభిన్నమైన తెలంగాణ ను రక్షించాలంటే కేసీఆర్ నాయకత్వమే శరణ్యమనే భావనతో ప్రజలు ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై విసిగిపోయిన అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ ఇచ్చే సందేశం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. 26 ఏళ్ళు పూర్తి చేసుకుని 27వ వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ పార్టీ కార్యకర్తల్లో భవిష్యత్ బీఆర్ఎస్ దేనన్న ఆనందం వెల్లివిరుస్తున్నదని అన్నారు.

# సర్కారు చేతికి మెట్రో..

- **వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో మార్పులు**
- **హైదరాబాద్ మెట్రో బోర్డులో సీఎస్, డీజీపీ**
- **ప్రభుత్వ నియంత్రణలోకి సంస్థ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:



హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు చరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇన్నాళ్లు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో నడిచిన మెట్రోను ఇప్పుడు పూర్తిగా ప్రభుత్వమే తన ఆధీనంలోకి తీసుకునేందుకు సిద్ధమైంది. ఎల్ అండ్ టీ, మెట్రో సంస్థలోని వంద శాతం ఈక్విటీ వాటాలను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ చారిత్రక పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఇకపై పూర్తిగా ప్రభుత్వ రంగ సంస్థగా మారనుంది. ఈ భారీ ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసింది. మొత్తం రూ.15 వేల కోట్ల భారీ డీల్‌ను ఈ నెల 30 లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధుల చెల్లింపుతో ఎల్ అండ్ టీ మెట్రోకు సంబంధించిన మొత్తం బాధ్యతలు, ఆస్తులు, అప్పులు ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. నష్టాల్లో ఉన్న మెట్రోను ఆదుకోవడంతో పాటు, రాబోయే సెకండ్ ఫేజ్ విస్తరణ పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది.


**మార్పులు మొదలు**

మెట్రో పగ్గాలను చేతుల్లోకి తీసుకున్నందున, పాలనా పరమైన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ మెట్రో బోర్డును కొత్తగా పునర్వ్యవస్థీకరిస్తూ కీలక అధికారులను నియమించింది. మెట్రో బోర్డు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును ప్రభుత్వం నియమించింది. ఇన్నాళ్లూ ప్రైవేట్ యాజమాన్యం పర్యవేక్షణలో ఉన్న బోర్డు, ఇప్పుడు సీనియర్ ఐఏఎస్ అధికారుల కనుసన్నల్లో పనిచేయనుంది. బోర్డు డైరెక్టర్లుగా రాష్ట్రానికి చెందిన అత్యున్నత స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, వికాస్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిలను బోర్డు సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారిని బోర్డులోకి తీసుకోవడం ద్వారా మెట్రో భద్రత , శాంతిభద్రతల పరంగా కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల మెట్రో చార్జీల నియంత్రణ, రాయితీలు, భవిష్యత్తు పొడిగింపు పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని భావిస్తున్న తరుణంలో, ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగి ప్రాజెక్టును హస్తగతం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామంతో గ్రేటర్ హైదరాబాద్ వాసులకు మరింత మెరుగైన రవాణా సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# జేఎన్టీయూహెచ్ నిర్ణయాలపై విద్యార్థుల ఆగ్రహం

- **విచారణ కమిటీ నివేదికపై అనుమానాలు**

ముద్ర, కూకట్‌పల్లి:




జేఎన్టీయూహెచ్‌లో ఏప్రిల్ 22న విడుదలైన కమిటీ నివేదిక వివాదాస్పదంగా మారింది. ఈ నివేదిక పారదర్శకతపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రొఫెసర్లపై ఉన్న అవినీతి, వేధింపుల కేసుల్లో పురోగతి లేకపోగా, చిన్నపాటి వాగ్వాదానికి సంబంధించి విద్యార్థులపై 6 నెలల బహిష్కరణ వేటు వేయడం అన్యాయమని బాధితులు ఆరోపిస్తున్నారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులను, సమస్యలపై పోరాడే నాయకులనే లక్ష్యంగా చేసుకుని కుట్ర పూరితంగా ఈ చర్యలు తీసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కమిటీల్లో విద్యార్థి ప్రాతినిధ్యం లేకపోవడం, ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రభావం ఉండటంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులపై బహిష్కరణను పునఃసమీక్షించాలని, ప్రొఫెసర్లపై ఉన్న పెండింగ్ కేసుల నివేదికలను విడుదల చేసి, కమిటీల్లో సమానత్వం పాటించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# మేడే ఆటో పోస్టర్ ఆవిష్కరించిన కేటీఆర్

ముద్ర, హైదరాబాద్:




బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ముద్రించిన మేడే ఆటో పోస్టర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం ఆవిష్కరించారు. నంది నగర్ జూబ్లీహిల్స్ లోని కేటీఆర్ నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ భవన్ లో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హైమద్ భాయ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి మల్లేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ బాబు, మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు రమేష్, చిన్న ఆనందు, ఖురాన్ శేఖర్, బాలకృష్ణ, అశోక్, నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్ పెదవి విప్పని ఓటరు

- **ఎవరి లెక్కలు వారివే!**

ముద్ర డెస్క్ :



పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన మొదటి విడత అసెంబ్లీ ఎన్నికలు దాదాపు 93 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. రికార్డుస్థాయి పోలింగ్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో నమోదైన అత్యధిక ఓటింగ్ శాతమిది, ఇది ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్య హోరాహోరీ పోరు నెలకొన్న నేపథ్యంలో, ఈ భారీ ఓటింగ్ ఎవరికి సానుకూలమనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను రేపుతోంది.

**మౌనంగా ఉన్న ఓటరు..**

భారీ ఓటింగ్ నమోదైనప్పటికీ, ఓటర్లు తమ అభిప్రాయాలను వెల్లడించకుండా మౌనంగా ఉండటం ఆసక్తికరంగా మారింది. గతంలో రాజకీయ దాడులకు గురయ్యామన్న భయంతో, బీజేపీ ఓటర్లు తమ ఓటు ఎవరికి వేశామనే విషయాన్ని బయటకు చెప్పడం లేదని కొన్ని వర్గాల సమాచారం. అలాగే, తృణమూల్ కాంగ్రెస్ అనుకూల ఓటర్లు కూడా తమ వ్యూహాన్ని బయటపెట్టకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఫలితాలు వెలువడే వరకు ఏ పార్టీకి ఎడ్జ్ ఉందనేది స్పష్టంగా చెప్పలేని స్థితి ఉన్నప్పటికీ, ఈ రికార్డు స్థాయి పోలింగ్ ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పు కోరుకునే వారి సంఖ్య పెరిగిందని సూచిస్తోంది. గతంలో కమ్యూనిస్టుల పాలన, ఆ తర్వాత తృణమూల్ హయాంలో జరిగిన హింసాత్మక ఘటనల వల్ల బెంగాల్ రాజకీయ రక్తచరిత్రకు వేదికగా నిలిచింది. అయితే, ప్రస్తుత ఎన్నికల్లో కఠినమైన నిబంధనలు అమలు చేయడం ద్వారా, ఎన్నికల ప్రక్రియను పండుగలా మార్చడంలో కమిషన్ సఫలీకృతమైంది. పశ్చిమ బెంగాల్ ఇప్పుడు 'జంగల్ రాజ్' నుంచి 'ప్రజాస్వామ్య మార్గంలోకి' అడుగులు వేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు..**

**గత ఎన్నికలతో పోలిస్తే, ఈసారి హింసాత్మక ఘటనలు 90 శాతం వరకు తగ్గుముఖం పట్టాయని నివేదికలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఎన్నికల కమిషన్ చేపట్టిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలేనని విశ్లేషకులు భావిస్తున్నారు. సుమారు 2.5 లక్షల మంది భద్రతా బలగాలను మోహరించడం, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ పోలింగ్ నిర్వహించింది. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు మోటార్ సైకిళ్లపై ఆంక్షలు విధించడం వంటి నిర్ణయాలు అల్లర్లను అరికట్టడంలో కీలకంగా మారాయి. కేంద్ర బలగాల సమర్థవంతమైన నిర్వహణ వల్ల పోలింగ్ కేంద్రాల వద్ద భయాందోళనలు తొలగి, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం ఏర్పడింది.**



# ఒక్క దెబ్బతో రెండు పిట్టలను కొట్టిన బీజేపీ

- **ఇక రాజ్యసభలో గేమ్ చేంజర్‌గా..**

ముద్ర డెస్క్ :

దేశ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 50 ఏళ్ల వరకు దేశాన్ని కాంగ్రెస్ పాలించింది. దీంతో ఆ పార్టీకి లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజారిటీ ఉండేది అందుకే రాజ్యాంగాన్ని చాలాసార్లు సవరించింది. అయితే 1970 తర్వాత రాజ్యసభలో ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ లేదు. కానీ ఇన్నేళ్ల తర్వాత లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజారిటీ దిశగా బీజేపీ పావులు కదుపుతోంది. తాజాగా బీజేపీ కొట్టిన దెబ్బకు రెండు పిట్టలు పడ్డాయి. ఒకటి ఆప్ పార్టీ దెబ్బతినగా, మరోవైపు బీజేపీ రాజ్యసభలో సంపూర్ణ మెజారిటీ దిశగా కదులుతుంది. ఇది 2029 ఎన్నికలకు ముందస్తు రాజకీయ మలుపుగా మారింది.

**ఆప్‌కు భారీ షాక్..**

పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌కు రాజ్యసభలో పది మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో ఏడుగురు ఎంపీలు రెండు రోజుల క్రితం (ఏప్రిల్ 23న) ఆ పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా వారు బీజేపీలో చేరారు. పార్టీ వ్యవస్థాపకులైన రాఘవ్ చద్దా నేతృత్వంలో జరిగింది. చద్దా ఉపనేత పదవి నుంచి తొలగించబడిన తర్వాత రాజీనామా చేసి, మరో ఆరుగురిని కూడా తీసుకెళ్లాడు. ఇది పార్టీ ఫిరాయింపు కాదని పూర్తి విలీనం' అని ప్రకటించారు. ఇప్పుడు ఆప్‌కు ముగ్గురు ఎంపీలు మాత్రమే మిగిలారు. ఇందులో ఇద్దరు పంజాబీలు.

**రాజ్యసభ బలాలు..**

రాజ్యసభలో మొత్తం 245 సీట్లు ఉన్నాయి. 123 సీట్లు ఉంటే సంపూర్ణ మెజారిటీ ఉన్నట్లు బీజేపీకి నవంబర్ నాటికి 113 సీట్లు వస్తాయి. తాజాగా బీజేపీలో చేరిన ఆప్ ఎంపీలు కలుపుకుంటే బీజేపీ బలం 120కి చేరుతుంది. మెజారిటీకి మూడు సీట్లు అవసరం ఉంటుంది. మిత్రపక్షాలతో కలిపి 155 సీట్లు బీజేపీకి ఉంటాయి. విపక్షాలు కేవలం 90 సీట్లకు పరిమితం అవుతాయి. 1970 తర్వాత సొంత బలంతో మెజారిటీ సాధించే ఏకైక పార్టీగా బీజేపీ నిలుస్తుంది.

**పంజాబ్ ఎన్నికలకు దెబ్బ..**

పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆప్‌కు తాజా పరిణామం పెద్ద దెబ్బ. ఎంపీల విలీనం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. బీజేపీకి లోక్‌సభలో 240 సీట్లతో మెజారిటీ ఉంచుకుంటూ, రాజ్యసభలో కూడా ఆధిపత్యం సాధిస్తోంది. ఇది సంపూర్ణ కూర్పు, మార్పులు, చేర్పుల ద్వారా 2029కు మార్గం సుగమం చేస్తుంది. ఆప్‌లో అసంతృప్తి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు కీలక కారణాలు. బీజేపీ రాజ్యసభ మెజారిటీతో కీలక బిల్లులు సులభంగా ఆమోదం పొందుతాయి. ఆప్ పంజాబ్‌లో బలహీనపడుతుంది. ఇది జాతీయ రాజకీయాల్లో బీజేపీ డామినెన్స్‌ను బలోపేతం చేస్తుంది. ప్రతిపక్షాలకు కొత్త సవాల్‌గా మారుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 27-04-2026
www.mudranews.in | @mudranews



చల్లని పానీయాలు తీసుకోండి
నిమ్మరసం, కొబ్బరి నీరు వంటి సహజ పానీయాలు శరీరాన్ని కూల్ చేస్తాయి.

# అంతర్జాతీయ టెక్ మ్యాప్ లో విశాఖకు చోటు

- గూగుల్ ఏఐ డేటా సెంటర్ కు విశాఖ జిల్లాలో శంకుస్థాపన
- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి
- 1 గిగా వాట్ సామర్థ్యంతో ఏర్పాటు
- ఈ నెల 28న తర్లువాడలో సీఎం శంకుస్థాపన
- గూగుల్ రాకతో విశాఖకు విశ్వఖ్యాతి
- టెక్ కంపెనీల ఆసక్తి

**ముద్ర, అమరావతి:** అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో ఏపీలో సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 28 తేదీన విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అతిపెద్ద హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో దేశ టెక్నాలజీ రంగంలో ఓ కొత్త చరిత్ర ఆవిష్కృతం కానుంది. ఆసియా ఖండానికే ఓ కీలకమైన ఏఐ గేట్ వేగా విశాఖ అవతరించనుంది. అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ టెక్ మ్యాప్ లో విశాఖ నగరం శాశ్వతంగా చోటు సంపాదించనుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ మెగా డేటా సెంటర్ విశాఖ నగరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నగరాల సరసన చేరనుంది. గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో దేశ చరిత్రలోనే అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా 1 గిగా వాట్ సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. కూటమి ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తుండటంతో గూగుల్ డేటా సెంటర్ సాకారం కానుంది. త్వరలోనే అందుబాటులోకి రానున్న సబ్ సీ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖతో వివిధ దేశాలతో నేరుగా అనుసంధానం ఏర్పడనుంది. ఈ డేటా సెంటర్ ద్వారా భారీగా డేటా స్టోరేజితో పాటు ఏఐ క్లౌడ్ ఇన్ ఫ్రా అందుబాటులోకి రానుంది.

## పోర్టు సిటీ నుంచి డేటా సిటీగా..

విశాఖపట్నం తీర ప్రాంతం కావడంతో అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుల్ ల్యాం డింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఎంతో అను కూలం. తర్లువాడ, అడవి వరం, రాంబిల్లి ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల విస్తీ ర్ణంలో, 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టులో అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా లాంటి సంస్థలు భాగస్వాము లుగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6.5 గిగా వాట్ల సామర్థ్యంతో మల్టీ–గిగావాట్ డిజిటల్ హబ్‌ను నిర్మించాల నేది ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాకుం డా, భారీగా ఉపాధి అవకాశాలను సృష్టిం చనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ ఆపరేషన్స్, మెయింటెనెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా సైంటిస్ట్ వంటి రంగాల్లో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేయనుంది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రంలో అనుబంధ రంగాల నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. పవర్ సిస్టమ్స్, కూలింగ్ టెక్నాలజీ, సర్వర్ తయారీ, నెట్‌వర్కింగ్ వంటి రంగాల్లో స్థానికంగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్లతో ఏఐ ఏకోసిస్టమ్ ఏర్పాటు కానుంది.


తర్లువాడలో గూగుల్‌కు కేటాయించిన భూమి

## విశాఖకు అంతర్జాతీయ హంగులు

గూగుల్ ఏఐ క్లౌడ్ సేవల ద్వారా విశాఖ ఆసియాలోనే ప్రధాన కేంద్రంగా మారనుంది. దీంతో పాటు ఏఐ ఆధారిత కంపెనీలకు కూడా విశాఖ గమ్యస్థానంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఏఐ ఎకోసిస్టమ్ తో ఐటీ స్టార్టప్ లు, రీసెర్చ్ సెంటర్లు క్లౌడ్, సెమీ కండక్టర్ కంపెనీలు విశాఖకు క్యూ కట్టే అవకాశముంది.. గూగుల్ సహా ఇతర టెక్ కంపెనీలు ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ల కోసం గ్రీన్ ఎనర్జీని సరఫరా చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రముఖ టెక్ సంస్థలన్నీ విశాఖ వైపు చూస్తుండటంతో ఇప్పుడు నగరానికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయలు కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వికసిత్ భారత్ 2047 విజన్ కు అనుగుణంగా, ఏపీని గ్లోబల్ టెక్ కేంద్రంగా మార్చే క్రమంలో గూగుల్ పెద్ద ముందడుగు కానుంది.

# ఘనంగా ఎమ్మెల్యే 'గంగుల' కుమారుడి వివాహం





- హాజరైన సీఎం, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

**కరీంనగర్, ముద్ర:** హైదరాబాద్‌లో నేడు కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కుమారుడు హరిహరన్ సాయి వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఈ వేడుకలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ వివాహ వేడుకకు విచ్చేసి దంపతులకు ఆశీస్సులు అంద జేశారు. వివాహ వేడుకకు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో వైభవంగా కొనసాగింది.





# ఘనంగా నిమిషాంబిక ఆలయ ఆవిర్భావ దినోత్సవం


- వేలాదిగా దర్శించుకున్న భక్తులు


**బోడుప్పల్, ముద్ర:** మల్కాజగిరి మునిసిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ డివిజన్ పెంటారెడ్డి కాలనీలో ఆదివారం శ్రీ మాత నిమిషాంబిక దేవి ఆలయ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. భక్తుల పాలిట కొంగు బంగారమై వెలసిన బోడుప్పల్ శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారి ఆదివారం తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు పూజాదికాలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం అనంతరం అమ్మవారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, భక్తులచే సామూహిక చండీ హోమం, మహిళలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం పంచ హారతి, నీరాజనం, మంత్రపుష్పము ఆశీర్వచనములు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులందరికీ సామూహిక భోజన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకకుండా అన్ని ఏర్పాట్లు చేసారు. అందరికీ మజ్జిగ, మంచి నీళ్ళు, ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావులు ఆలయంలో ఉండి భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా చూశారు. ఆలయ ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్.సాయిబాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, వై. చంద్రశేఖర్, ఎన్. మోహన్, ఎస్. గౌరి శంకర్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, ఎన్. రామకృష్ణ, వై. సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమకాంత్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



# ఈవెంట్‌లో ట్రంప్ పై కాల్పులు..

**ముద్ర డెస్క్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాల్గొన్న కార్యక్రమంలో ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంఘటన కలకలం రేపింది. బాల్‌రూమ్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఆ దుండగుడు.. అధ్యక్షుడు ట్రంప్ సహా అధికారులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోందని తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే వెల్లడించారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6 గంటలు.. అమెరికా కాలమానం ప్రకారం శనివారం రాత్రి ఎనిమిది గంటల వేళలో వాషింగ్టన్ హిస్టారిక్ హిల్ టాన్ హోటల్ లో వైట్ హౌస్ కరస్పాండెంట్ అసోసి యేషన్ విందును ఏర్పాటు చేశారు. విందు ప్రారంభమైన సుమారు ఐదు నిమిషాల తర్వాత.. హోటల్ బయట ప్రధాన మాగ్నె టోమీటర్ స్క్రీనింగ్ ఏరియాలో కాల్పుల శబ్దం వినిపించింది. నాలుగు నుంచి ఎనిమిది రౌండ్ల వరకు కాల్పులు జరిపి నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాల్పులు జరిగాయంటూ భద్రతా సిబ్బంది పెద్ద ఎత్తున అరుస్తూ అందరిని అలెర్టు చేశారు. సీక్రెట్ ఏజెంట్లు తమ ఆయుధాల్ని తీసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆయన సతీమణి, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తలను కిందకు వంచి.. వేదిక నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు.





## అతిథిగా బస చేసి..

నిందితుడు కాలిఫోర్నియా నుంచి రైలులో తొలుత షికాగో, అక్కడి నుంచి వాషింగ్టన్‌కు వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. అనంతరం శనివారం రాత్రి వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమం జరిగే హిల్టన్ హోటల్ లో బస చేసినట్లు నిర్ధారించారు. కార్యక్రమం మొదలైన కొద్దిసేపటికే ఆ ప్రాంగణంలో కాల్పుల మోత వినిపించింది. నిందితుడు బారికేడ్లను దాటుకొని బాల్ రూమ్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే కాల్పులు చోటుచేసుకున్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. అతడిని లాస్‌ఏంజెలెస్‌లోని టోరెన్స్ ప్రాంతానికి చెందిన కోలో టామోస్ అలెన్ (31)గా గుర్తించారు. నిందితుడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, అతడి చేతి రాతలను పరిశీలించిన అధికారులు.. ఆ విందులో పాల్గొన్న అధికారులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు టాడ్ బ్లాంచే వెల్లడించారు. అధ్యక్షుడినీ లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. అతడి వద్ద ఉన్న ఆయుధాలను గడిచిన రెండేళ్ల వ్యవధిలో కొనుగోలు చేసి ఉంటాడని భావిస్తున్నామన్నారు. అయితే, ఎందుకు ఈ కాల్పులకు పాల్పడ్డాడనే విషయంపై స్పష్టత లేదని, దర్యాప్తునకు నిందితుడు సహకరించడం లేదన్నారు. మరిన్ని అభియోగాలు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు అటార్నీ జనరల్ పేర్కొన్నారు.

### తల్లి సహా మూడేళ్ల చిన్నారిపై దాడి..

**ముద్ర డెస్క్:** అమెరికాలోని టెక్సాస్ లో మూడేళ్ల చిన్నారి సహా ఆమె తల్లిపై దాడి చేసిన ఓ భారతీయుడిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. శాన్ ఆంటోనియోలోని ఓ పార్కులో ఇటీవల ఈ వ్యవ హారం చోటుచేసుకుంది. అమెరికా హో మ్ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకారం.. ఏప్రిల్ 18న శాన్ ఆంటోనియోలోని ఓ పార్కులో మూడేళ్ల చిన్నారితో వెళ్తున్న గాబ్రియెల్లా పెరెజ్ అనే మహిళపై అథర్వ వ్యాస్(24) దాడి చేశాడు. చిన్నారి ముఖానికి గాయాలయ్యాయి. బాలిక రెండు దంతాలు కూడా కోల్పోయినట్లు తెలిసింది.

# స్వీయ గణనలో సీఎం రేవంత్ రెడ్డి వివరాల నమోదు



**ముద్ర డెస్క్:** జనగణనలో భాగంగా సీఎం ఎ. రేవంత్ రెడ్డి స్వీయ గణనలో పాల్గొని వివరాలను నమోదు చేసుకున్నారు. జన గణన 2027లో భాగంగా తెలంగాణలో ఆదివారం నుంచి ఆన్‌లైన్ లో స్వీయ గణన ప్రారంభమైంది. ఈ సందర్భంగా వెబ్‌సైట్ లో ముఖ్యమంత్రి వివరాలను స్వీయ నమోదు చేసుకున్నారు. అత్యంత కీలకమైన ఈ కార్యక్రమంలో ప్రజలు విశేషంగా పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. జనాభా లెక్కల కార్యక్రమంలో ముందు గా చేపట్టిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్ర మానికి సంబంధించి సెన్సస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయిం ట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక ఆల, సమాచార పౌర సంబంధాల కమిషనర్ సీహెచ్. ప్రియాంకతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైమానిక దళంలో పాక్ అనుకూలుల ఏరివేత..

- బంగ్లాదేశ్‌లో కీలక పరిణామం..

**ముద్ర డెస్క్:** బంగ్లాదేశ్ వైమానిక దళంలో ఇటీవల చేపట్టిన ప్రక్షాళన చేపట్టింది. మహ్మద్ యూనస్ పాలనలో వైమానికదళాన్ని మొత్తం భ్రష్టుపట్టించాడు. పాకిస్తాన్ అనుకూలులకు పదవులు కట్టబెట్టారు. ఐఎస్ఐ జోక్యం పెరిగింది. భారత సరిహద్దులో ఉన్న ఎయిర్ బేస్‌లు, రాడార్ కేంద్రాల నుంచి భారత సమాచారం, కదలికల వివరాలను పాకిస్తాన్‌కు పంపేలా ఏర్పాట్లు చేసుకుంది. తాజాగా చేపట్టిన ప్రక్షాళనతో ఆ దేశ భద్రతతో పాటు, పొరుగు దేశమైన భారత్‌కు కూడా ఎంతో కీలకం.

## ఎయిర్ ఫోర్స్‌లో కీలక పరిణామాలు

బంగ్లాదేశ్ తన వైమానిక దళంలో అంతర్గత భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో ఏప్రిల్ 20 నుంచి భారీ ప్రక్షాళనను ప్రారంభించింది. ఈ చర్యలో భాగంగా స్క్వాడ్రన్ లీడర్ స్థాయి అధికారుల నుంచి ఎయిర్ క్రాఫ్ట్ మెన్ వరకు అనేకమందిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. దర్యాప్తులో భాగంగా సిబ్బంది తమ మొబైల్ ఫోన్లను అధికారులకు అప్పగించాలని, ఎటువంటి సమాచారాన్ని తొలగించకూడదని కఠిన ఆదేశాలు జారీ అయ్యాయి.

## పెరిగిన ఐఎస్ఐ ప్రభావం..

బంగ్లాదేశ్ రక్షణ వ్యవస్థలో పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ప్రభావం పెరగడం భారత్‌కు ప్రధాన ఆందోళనగా మారింది. రాడార్ స్టేషన్లు, ఎయిర్ బేస్‌లలోని కొందరు కీలక అధికారులు పాకిస్తాన్ అనుకూల ధోరణిని ప్రదర్శిస్తూ, వ్యూహాత్మక సమాచారాన్ని చేరవేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని రాడార్ కేంద్రాల ద్వారా భారత వైమానిక దళం యొక్క కదలికలను గమనించి, ఆ వివరాలను పాకిస్తాన్‌కు పంపడం ద్వారా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లిందని విశ్లేషణలు చెబుతున్నాయి.

## దౌత్యపరమైన సంబంధాలు..

ఈ ప్రక్షాళన వెనుక ఇరు దేశాల మధ్య జరిగిన దౌత్యపరమైన చర్చలు కీలక పాత్ర పోషించాయి. ఏప్రిల్ 2026 ప్రారంభంలో బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీల్ ఉర్ రహమాన్ భారత పర్యటనలో భాగంగా, ఇరు దేశాల మధ్య కరెన్సీ స్వాప్ ఒప్పందం, ఆర్థిక సహకారంపై చర్చలు జరిగాయి. ఈ పర్యటనలో భారత్ తన సరిహద్దు భద్రతకు సంబంధించిన ఆందోళనలను వ్యక్తం చేయగా, బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పందిస్తూ వైమానిక దళంలో చొరబాట్లను అరికట్టేందుకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రక్షాళన మొదలు పెట్టింది. ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత బలోపేతం చేసే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్ జమాన్ వంటి భారత్ అనుకూల వ్యక్తులు వ్యవస్థను ప్రక్షా ళన చేయడంలో కీలకంగా వ్యవహరిస్తు న్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బంగ్లాదే శ్‌కు, భారత్ అందిస్తున్న సహకారం రాను న్న కాలంలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత దృఢం కానుంది. మాల్దీవులు కూడా ఇటీవలే కరెన్సీ స్వాప్ చేసుకుంది. దీంతో ఇరు దేశాలకు లాభం జరుగుతుంది.

# పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం..

## - మంత్రి పొన్నం

**ముద్ర డెస్క్:** రాష్ట్ర వ్యాప్తంగా రహదారి సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపైన ఉప్పునుంతల మండల పరిధిలోని డిండికట్ట మైసమ్మ ఆలయ కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా బస్సులు వెళ్లని గ్రామాలను గుర్తించి బస్సుల్ని నడుపుతామన్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రజలందరికీ సమాన న్యాయం కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధిని కోరి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



సరైన హైజీన్ పాటించండి
చెమట ఎక్కువగా వచ్చే ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం.




## భారీ లక్ష్యాలపై పంజాబ్ దండయాత్ర...
# ఐపీఎల్‌లో కొత్త చరిత్ర

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో భారీ స్కోర్లను ఛేదించడం ఎప్పుడూ కఠిన సవాలే అయినా, పంజాబ్ కింగ్స్ మాత్రం ఈ విషయంలో మరోసారి తన సత్తా చాటింది. ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై జరిగిన మ్యాచ్‌లో 265 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.5 ఓవర్లలోనే ఛేదించి కొత్త చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక విజయవంతమైన ఛేజ్ రికార్డును మరోసారి తన పేరిటే నిలబెట్టుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 264 పరుగులు చేసి భారీ స్కోర్ నమోదు చేసింది. అయితే పంజాబ్ బ్యాటర్లు ఏమాత్రం ఒత్తిడికి లోను కాకుండా దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని సులభంగా అందుకున్నారు. ఇదే జట్టు 2024లో కోల్‌కతాపై 262 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి అప్పట్లోనూ రికార్డు సృష్టించడం విశేషం. ఐపీఎల్ చరిత్రలో టాప్ రెండు ఛేజింగ్ రికార్డులు పంజాబ్ పేరుపైనే ఉండటం వారి బ్యాటింగ్ బలం ఏమిటో చెప్పకనే చెప్తుతుంది. ఈ జాబితాలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో ఉంది. 2025లో పంజాబ్‌పై 246 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్, 2026లో రాజస్థాన్‌పై 229 పరుగుల లక్ష్యాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2025లో లక్నోపై 228 పరుగుల ఛేజ్ చేసి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ప్రస్తుతం ఐపీఎల్‌లో బ్యాటింగ్ స్థాయి ఎంత పెరిగిందో ఈ రికార్డులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. భారీ లక్ష్యాలే అయినా ఛేదించడం సాధ్యమే అన్న నమ్మకంతో జట్లు ఆడుతున్నాయి. ముఖ్యంగా పంజాబ్, హైదరాబాద్ జట్లు పరుగుల వర్షం కురిపిస్తూ అభిమానులకు వినోదాన్ని అందిస్తున్నాయి.



## ముమ్మరంగా స్పోర్ట్స్ అథారిటీ
# సమ్మర్ కోచింగ్ క్యాంప్స్

**జూన్ 7 వరకు 33 జిల్లాలలో స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంపులు**



స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని అన్ని స్టేడియాల్లో మరియు 33 జిల్లాలలో ఏప్రిల్ 24తేదీ నుండి ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలుజూన్ 6 వరకు నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులకు యువ క్రీడాకారుల నుండిఅనూహ్య స్పందన లభిస్తోందని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తెలిపింది. జంట నగరాల్లోని స్టేడియంలో ఇప్పటికే 2 వేలకు మంది క్రీడాకారులకు పైగా ఆన్‌లైన్‌ద్వారా నమోదు చేసుకొని ఈ క్రీడల్లో పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, ఎల్ బి స్టేడియం, జింఖానా గ్రౌండ్,సరూర్నగర్ ఇండోర్ స్టేడియం,యూసుఫ్ గూడా కేవీబి ఆర్ ఇండోర్ స్టేడియం, ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రం హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లలో ఈ శిక్షణా శిబిరాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల నుండి వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహించి ఎంతో మంది క్రీడా ఆణిముత్యాలను గుర్తించి ప్రోత్సహించింది స్పోర్ట్స్ అథారిటీ. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్ వంటి ఎందరో క్రీడాకారులు అజారుద్దీన్, పుల్లెల గోపీచంద్ లాంటి క్రీడాకారులకు ప్రాథమిక పాఠాలు నేర్పింది స్పోర్ట్స్ అథారిటీ. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లు ఆన్ లైన్ గేమ్ లు,కంప్యూటర్ల కేపరిమితం కాకుండా వారికి ఆటల ద్వారా ఆరోగ్యం అందించడమే కాకుండా మనోవికాసానికి ఈ వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని క్రీడా శాఖ అధికారులు తెలిపారు. అనేక ప్రైవేట్ కోచింగ్ తో పోలిస్తే స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాల్లో అనుభవం కలిగిన కోచులు మధ్యతరగతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే రుసుముతో మంచి ప్రమాణాలు కలిగిన క్రీడా శిక్షణ అందిస్తున్నామని స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగ మరియు జుంబా డాన్స్ లలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపింది. గత వేసవి శిబిరాల్లో ప్రవేశ పెట్టిన యోగా జుంబా లకు విపరీతమైన ఆదరణ లభించిందని ఈ సంవత్సరం కూడా అదేవిధంగా కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. గతంలో కంటే ఈ సంవత్సరం ఎక్కువ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తున్నామని అంతేకాకుండా కాకుండా గతంలో కేవలం జిల్లా కేంద్రాలకు పరిమితం అయినా ఈ వేసవి శిక్షణ శిబిరాలను ఈసారి పలు పట్టణ కేంద్రాల్లో కూడా నిర్వహించబోతున్నమని స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది ఈ వేసవి శిబిరాల్లో వివిధ క్రీడాంశాల్లో అసిస్టెంట్ కోచులుగా సేవలందించే వారికి గౌరవ వేతనం గత సంవత్సరం నుండి పెంచి అనుభవజ్ఞులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోంది . ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనబోతున్న క్రీడాకారులు విద్యార్థులను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలని వారి సమాచారాన్ని భవిష్యత్తులో క్రీడా అవసరాలకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. యువతను మైదానాల వైపు మళ్లించడానికే. . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలమేరకు గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ముమ్మరంగా ఏర్పాటు చేసినట్లు యువ క్రీడాకారులు ,విద్యార్థులు ఈ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేసినట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నామని ఆయన తెలిపారు. అసిస్టెంట్ కోచులుగా సేవలందించే వారి వివరాలను కూడా ఆన్ లైన్లో కొందుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వము చేపడుతున్న క్రీడా ప్రోత్సాహక విధానాల వల్ల క్రీడల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరుగుతోందని అందుకే ఈ శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తుందని ఆయన వివరించారు



# ఐపీఎల్‌లో పరుగుల సునామీ


**ఒకే రోజు రెండు భారీ ఛేజింగ్‌లు**

ఐపీఎల్ 2026 ఏప్రిల్ 25 మ్యాచ్‌లు అభిమానులకు మరచిపోలేని రన్ ఫెస్టివల్‌గా నిలిచాయి. రెండు వేర్వేరు మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌మెన్‌లు విరుచుకుపడి భారీ స్కోర్లు నమోదవ్వగా, అదే స్థాయిలో అద్భుత ఛేజింగ్‌లు కూడా జరిగాయి. ఢిల్లీ క్యాపిటల్స్-పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన పోరులు లీగ్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. మొదటి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 264 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. కేఎల్ రాహుల్ 67 బంతుల్లో 152 పరుగులతో అదిరిపోయే ఇన్నింగ్స్ ఆడగా, నితీష్ రాణా 91 పరుగులతో బలమైన భాగస్వామ్యం అందించాడు. అయితే ఈ స్కోర్ కూడా ఢిల్లీకి విజయాన్ని అందించలేకపోయింది. పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు అసాధారణంగా ఆడుతూ కేవలం 18.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రభసిమ్రాన్ సింగ్, శ్రేయాస్ అయ్యర్, ప్రియాన్ష్ ఆర్య కీలక ఇన్నింగ్స్‌లతో జట్టుకు అద్భుత విజయం అందించారు. మరో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 228 పరుగుల భారీ స్కోర్ చేసింది. కానీ సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అదే దూకుడుతో 18.3 ఓవర్లలోనే 229 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 38 బంతుల్లో 103 పరుగులతో సంచలనం సృష్టించగా, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు కూడా కీలకంగా రాణించారు. ఒకే రోజులో రెండు 220కి పైగా లక్ష్యాలను విజయవంతంగా ఛేదించడం, 265 పరుగుల టార్గెట్‌ను సాధించడం వంటి రికార్డులు నమోదయ్యాయి. యువ ఆటగాళ్ల ప్రతిభ, బ్యాటింగ్ దూకుడు ఐపీఎల్ స్థాయిని మరోసారి చాటాయి. ప్రపంచంలోనే అగ్రగామి టీ20 లీగ్‌గా ఐపీఎల్ ఎందుకు నిలుస్తుందో ఈ మ్యాచ్‌లు స్పష్టంగా చూపించాయి.



# హద్దు దాటిన అభిమానం

**అభిషేక్‌కు అసౌకర్యం**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సెలబ్రిటీలను చూసిన వెంటనే అభిమానులు సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం ముందుకు రావడం సహజమే. అయితే అదే అభిమానం హద్దులు దాటితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. తాజాగా టీమిండియా యువ ఆటగాడు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మకు అలాంటి అనుభవమే ఎదురైంది. హోటల్ వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐపీఎల్ 2026లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం హోటల్ గదికి వెళ్తున్న అభిషేక్‌ను ఒక మహిళా అభిమాని ఒక్కసారిగా అతని చేతిని పట్టుకుని లాగింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆమె నుంచి అతన్ని విడిపించారు. ఈ సంఘటనలో అభిషేక్ స్పష్టంగా అసౌకర్యానికి గురైనట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. అభిమానం వ్యక్తపరచడంలో హద్దులు ఉండాలని నెటిజన్లు సూచిస్తున్నారు. ఇదే విధంగా ఒక పురుష అభిమాని మహిళా క్రీడాకారిణిపై ప్రవర్తించి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. క్రీడాకారుల వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అభిమానులపై కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# అదరగొట్టిన సాయి సుదర్శన్

- **చెన్నైపై గుజరాత్ సూపర్ విక్టరీ**



ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని గుజరాత్ 16.4ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (87; 46 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) అదరగొట్టాడు. జోస్ బట్లర్ (39*) శుభ్‌మన్ గిల్ (33) పరుగులు చేశారు. ఎనిమిది మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది నాలుగో విజయం కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన సీఎస్కే ఐదో ఓటమిని ఖాతాలో వేసుకుంది. తొలుత చెన్నై బ్యాటర్లలో కెప్టెన్, ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (74*; 30 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. సంజు శాంసన్ (11), శివమ్ దూబె (22), జేమీ ఒవర్టన్ (18), కార్తిక్ శర్మ (15) పరుగులు చేశారు. ఉర్విల్ పటేల్ (4) విఫలం కాగా.. సర్ఫరాజ్ ఖాన్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. 12 ఓవర్లకు 51/4తో ఉన్న సీఎస్కే.. రుతురాజ్, ఓవర్టన్ దూకుడుగా ఆడటంతో చివరి 8 ఓవర్లలో 107 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో రబాడ 3, అర్షద్ ఖాన్ 2, మానవ్ సుతార్, సిరాజ్ ఒక్కో వికెట్ తీశారు.

# ధోనీ రీఎంట్రీపై సందిగ్ధం

- **జట్టుకోసమే వెనుకడుగు?**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మళ్లీ మైదానంలోకి దిగుతాడా అన్నదానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ మొత్తం దూరంగా ఉన్న ధోనీ, తాజాగా ఫిట్‌నెస్ టెస్ట్‌ను క్లియర్ చేసినప్పటికీ వెంటనే జట్టులో చేరాలా వద్దా అన్న విషయంలో ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. టీవలి రోజులుగా జట్టుతోనే ప్రయాణిస్తున్న ధోనీ నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే తాను జట్టులోకి వస్తే ఒక యువ ఆటగాడు బయటకు వెళ్లాల్సి రావడం, కీలక దశలో టీమ్ కాంబినేషన్‌పై ప్రభావం పడే అవకాశం ఉండటం వంటి కారణాలతోనే రీఎంట్రీని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. జట్టు సమతుల్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాడని నివేదికలు సూచిస్తున్నాయి. ఈ విషయంపై సీఎస్‌కే బ్యాటింగ్ కోచ్ మిచెల్ హస్సి కూడా స్పందించాడు. ధోనీ తిరిగి వస్తే కేవలం బ్యాటర్‌గా కాకుండా వికెట్‌కీపర్‌గా ఆడతాడని, ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే వినియోగించే ఆలోచన లేదని స్పష్టం చేశాడు. ముంబైలో జరిగిన మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో వికెట్‌కీపింగ్ ప్రాక్టీస్ చేసినప్పటికీ, ఇంకా పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాల్సి ఉందని తెలిపాడు. ప్రస్తుతం నెట్స్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ధోనీ, పూర్తిగా కోలుకున్న తర్వాతే మైదానంలోకి రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో చెన్నై ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ధోనీ నిర్ణయం పూర్తిగా అతని చేతుల్లోనే ఉందని తెలుస్తోంది. అభిమానులు మాత్రం ‘తల’ మళ్లీ గ్రౌండ్‌లో మెరవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎంగిడికి తీవ్ర గాయం

పంజాబ్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ ఢిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్‌బౌలర్ లుంగి ఎంగిడి (దక్షిణాఫ్రికా) తీవ్రంగా గాయపడ్డాడు. క్యాచ్ పట్టే ప్రయత్నంలో అతడు పడ్డ తీరు, ఆ తర్వాత కదలలేకపోయిన తీరు అందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అంబులెన్స్‌లో ఎంగిడిని ఆస్పత్రికి తీసుకెళ్లాల్సివచ్చింది. పంజాబ్ ఛేదనలో మూడో ఓవర్లో జరిగింది ఆ ఘటన. పంజాబ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కొట్టిన బంతి గాల్లోకి లేవగా బంతి దిశను ఎంగిడి తప్పుగా అంచనా వేశాడు. వెనక్కి అడుగులేస్తూ బంతిని అందుకునే ప్రయత్నం చేశాడు. క్యాచ్ అందలేదు కానీ అతడు అదుపు తప్పి వెనక్కి పడ్డాడు. ఆ క్రమంలో తల మైదానానికి బలంగా తగలింది. మెడ కూడా ఒత్తిడికి గురైంది. తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిన అతడు.. మళ్లీ లేవలేకపోయాడు. వెంటనే వైద్య సిబ్బంది స్ట్రెచర్‌తో మైదానంలోకి వచ్చారు. చాలా సేపు అతణ్ని కదపకుండా అలాగే ఉంచారు. ఎంగిడి వాళ్లతో మాట్లాడడం కనిపించింది. ఎంగిడిని స్ట్రెచర్‌తోనే అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## లవ్ స్టోరీకి 'ఫస్ట్ టైం' టచ్... ట్రైలర్‌కు డేట్ ఫిక్స్

ముద్ర, సినిమా డెస్క్:

'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పాయల్ రాజ్‌పుత్ మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. హేమంత్ ఇప్పనపల్లి దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తున్న ఈ సినిమా 'ఫస్ట్ టైం' పేరుతో రూపొందుతోంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఈ నెల 28న పాయల్ రాజ్‌పుత్ విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో సౌరబ్ ధింగ్ర హీరోగా పరిచయం అవుతుండగా, అనిక్క విక్రమన్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'బిగ్ బాస్' ఫేమ్ అఖిల్ సార్థక్ సెకండ్ లీడ్‌లో కనిపించనున్నారు. శ్రీవెంకట్, సూరజ్ ఎస్ కురుప్ సంగీతం అందిస్తుండగా, వేణు మురళీధర్, రామ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత హేమంత్ ఇప్పనపల్లి మాట్లాడుతూ, చిన్న బడ్జెట్ సినిమా అయినప్పటికీ టెక్నికల్‌గా ఎక్కడా తగ్గకుండా గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నామని తెలిపారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించకుండా పూర్తిగా హ్యూమన్ క్రియేటివిటీతో హై క్వాలిటీ గ్రాఫిక్స్ రూపొందిస్తున్నామని చెప్పారు. మే 22న ఈ సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మైమ్ గోపి, శివ, భూపాల్ రాజు, గాయత్రి గుప్త, అన్నపూర్ణమ్మ, అజయ్ రత్నం, ఢీ పండు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రేమ కథతో పాటు వినూత్న ట్రీట్‌మెంట్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది.

## రెడ్ హాట్ లుక్‌లో డ్రాగన్ లేడీ



ముద్ర, సినిమా డెస్క్:

కన్నడ నటి రుక్మిణి వసంత్ 'జిక్యూ మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ యంగ్ ఇండియన్స్ 2026' ఈవెంట్‌లో తన రెడ్ హాట్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఎరుపు సీక్విన్ సారీ గౌన్‌లో ఆమె కనిపించిన తీరు గ్లామర్‌కు కొత్త హంగులు జోడించినట్టుగా అనిపించింది. స్ట్రాప్‌లెస్ కార్సెట్ టాప్‌పై నాజూకైన ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ, దానికి జతగా మెరిసే డ్రేప్డ్ స్కర్ట్ ఆమె అందాన్ని మరింత వెలిగించాయి. అలంకరణల్లో సింపుల్‌గా ఉండాలని చూసిన రుక్మిణి, కేవలం సిల్వర్ హూప్ ఇయరింగ్స్‌తోనే తన స్టైల్‌ను పూర్తి చేసింది. దీంతో ఎరుపు దుస్తుల మెరుపు మరింత హైలైట్ అయింది. ఆమె హావభావాలు, ఆత్మవిశ్వాసం అన్నీ కలిసి స్టేజ్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిపాయి. ఈ గౌరవంపై స్పందిస్తూ, తాను ఈ గుర్తింపుకు అర్హురాలినేనా అన్న భావన వచ్చినప్పటికీ, ఎక్కువగా కృతజ్ఞతతో నిండిపోయానని ఆమె తెలిపింది. అవార్డు ఫ్లాక్‌తో చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫోటో అభిమానులను ఆకట్టుకుంది. కన్నడ సినీ రంగంలో తన ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న రుక్మిణి వసంత్‌కు ఈ అవార్డు మరింత ప్రోత్సాహంగా మారింది. గ్లామర్, నటన రెండింటినీ సమానంగా సమతుల్యం చేస్తూ ఆమె తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.



## ఎన్టీఆర్ బర్త్‌డే స్పెషల్‌గా 'ఊసరవెల్లి' రీ రిలీజ్

ముద్ర, సినిమా డెస్క్:

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటించిన 'ఊసరవెల్లి' సినిమాను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మే 20న ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం స్టార్ హీరోల బర్త్‌డేలకు వారి హిట్ చిత్రాలను రీ రిలీజ్ చేయడం ట్రెండ్‌గా మారిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2011లో విడుదలైన ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటించగా, సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించారు. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సాధారణ స్థాయి ఫలితాన్ని సాధించినప్పటికీ, ఎన్టీఆర్ నటనకు విశేష ప్రశంసలు లభించాయి. తమన్నాతో ఆయన కెమిస్ట్రీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించారు. యాక్షన్, ఎమోషన్ మేళవించిన ఈ సినిమా రీ రిలీజ్‌తో మరోసారి థియేటర్లలో సందడి చేయనుంది. అభిమానుల నుంచి ఈ స్పెషల్ షోలకు మంచి స్పందన వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ప్రియాంక ఖాతాలో మరో గ్లోబల్ అవార్డు



ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదిగిన ప్రియాంక చోప్రాకు మరో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన ప్రముఖులను సత్కరించే ప్రతిష్ఠాత్మక సంస్థ 'గోల్డ్ హౌస్' ఈ ఏడాది గోల్డ్ గాలాలో ఆమెను ప్రత్యేకంగా సన్మానించనుంది. వినోద రంగంలో ఆమె సాధించిన విజయాలు, ప్రపంచవ్యాప్తంగా ఆసియా ప్రతిభను ప్రతిబింబించిన పాత్రను గుర్తిస్తూ ఈ గౌరవం అందజేస్తున్నారు. ప్రతి ఏడాది వివిధ రంగాల్లో రాణిస్తున్న ఆసియా ప్రముఖులతో 'గోల్డ్ 100' జాబితాను విడుదల చేసే ఈ సంస్థ, ఈసారి ప్రియాంకను 'గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్'కు ఎంపిక చేసినట్లు ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ ప్రతిష్ఠను పెంచడంలో ఆమె చేసిన కృషి ఈ అవార్డుకు కారణమైంది. ఈ గోల్డ్ గాలా ఐదో ఎడిషన్‌గా 'ఎ న్యూ గోల్డ్ వరల్డ్' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. మే 9, 2026న లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఈ వేడుకలో ప్రియాంక చోప్రాకు ఈ ప్రత్యేక గౌరవం అందించనున్నారు. ఈ అవార్డుతో ఆమె గ్లోబల్ స్థాయిలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.

## గ్లామర్ హద్దులు చెరిపేస్తున్న శనయా

ముద్ర, సినిమా డెస్క్:

యువ నటి శనయా కపూర్ తాజా ఫోటోషూట్‌తో మళ్లీ ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. నలుపు లెదర్ కార్సెట్ టాప్, మెర్మెయిడ్ స్టైల్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు సంప్రదాయ గ్లామర్‌కు భిన్నంగా, కొత్త ట్రెండ్‌ను సూచించిన ట్టుగా అనిపించింది. తెల్లని లేస్ డిటైల్స్ ఆమె లుక్‌కు సున్నితమైన అందాన్ని జోడించాయి. బెల్ట్‌పై వెస్టర్న్ టచ్ ఉన్న బ్రెయిడెడ్ మెరిసే సిల్వర్ బకిల్స్ ఆమె స్టైల్‌ను మరింత బోల్డ్‌గా మార్చాయి. తేలికగా వాలిన జుట్టు, స్మోకీ ఐ మేకప్, షార్ప్ హీల్స్ అన్నీ కలిసి ఆమెను ఓ





## నేను అలా కనిపించినందుకు క్లాప్స్.. ఎప్పటికీ మర్చిపోలేను: ధనుష్

'కర' సినిమాతో ప్రేక్షకులను మరోసారి పలకరించేందుకు సిద్ధమయ్యారు కోలీవుడ్ ప్రముఖ నటుడు ధనుష్. ఆయన హీరోగా విఘ్నేశ్ రాజా తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ తెలుగులోనూ ఈనెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి కోయంబత్తూరులో ఓ ఈవెంట్ నిర్వహించారు. ధనుష్ మాట్లాడుతూ.. నిజాయతీగా పని చేశారంటూ 'కర' చిత్ర బృందాన్ని కొనియాడారు. తన గత సినిమా 'పొల్లాధవన్'ను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు.

**నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్**

''పొల్లాధవన్' నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్. బాడీ ఫిట్‌నెస్ విషయంలో.. ఈ సినిమాకి ముందు నన్ను చాలామంది విమర్శించేవారు. దాన్ని ఛాలెంజింగ్ తీసుకున్నా. అలా 'పొల్లాధవన్'లో సిక్స్‌ప్యాక్‌లో కనిపించా. నా శరీరాకృతికి ప్రేక్షకుల నుంచి చప్పట్లు రావడం అదే తొలిసారి. ఆ క్షణాల్ని ఎప్పటికీ మర్చిపోలేను'' అని అన్నారు. వెట్రిమారన్ తెరకెక్కించిన యాక్షన్ డ్రామా మూవీ 'పొల్లాధవన్' 2007లో విడుదలైంది. ఆ తర్వాత ఈ హిట్ కాంబినేషన్‌లో 'ఆడుకాలం', 'వడచెన్నై', 'అసురన్' సినిమాలొచ్చాయి.



## అందాలతో కూల్ చేస్తున్న కృతి

ముద్ర, సినిమా డెస్క్:

వేసవి వేడి తీవ్రత పెరుగుతున్న వేళ అందరూ తేలిక దుస్తులకే మొగ్గు చూపుతుంటే, యువ నటి కృతి శెట్టి మాత్రం సంప్రదాయ దుస్తుల్లోనే తన అందాన్ని మెరిసేలా చేసింది. పూర్తి సాటిన్ చీరలో ఆమె కనిపించిన తీరు ఎండ మధ్య కూడా ఒక చల్లని అనుభూతిని కలిగించినట్టుగా అనిపించింది. అధిక ఉష్ణోగ్రతల మధ్య కూడా ఆమె స్టైల్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. మింట్ గ్రీన్ సాటిన్ చీరపై యెల్లో టైడై డిజైన్లు ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. ఫ్లోరల్ బ్లౌజ్, మెరిసే డైమండ్ ఇయరింగ్స్, సాఫ్ట్ వేవీ హెయిర్—అన్నీ కలిసి ఆమెను ఒక ఫ్రెష్ సమ్మర్ ఫీల్‌లా చూపించాయి. సాధారణంగా వేడి కాలంలో కనిపించని చల్లదనాన్ని ఆమె తన స్టైలింగ్‌తో అందించింది. బయట 45 డిగ్రీల ఎండలు మండుతున్నా, ఆ ప్రభావం ఎక్కడా కనిపించకుండా కృతి శెట్టి తన అందంతో ఆకట్టుకుంది. గ్లామర్‌తో పాటు సంప్రదాయానికి విలువనిస్తూ, ఎప్పటికీ ఫ్యాషన్‌లో నిలిచే స్టైల్ ఇదేనని మరోసారి నిరూపించింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com